ప్రపంచ పర్యాటక దినోత్సవానికి గండికోట ముస్తాబు

జమ్మలమడుగు గ్రామీణ, చిన్నచౌకు (కడప), న్యూస్‌టుడే: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా గండికోటలో వేడుకలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. గురువారం రాత్రి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఆర్డీవో శ్రీనివాస్‌తో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి గండికోటలో గుర్రపుస్వారీ, చిల్డ్రన్స్ పార్క్, వాహనాల పార్కింగ్ ఏరియా, బ్యాంకు ఏటీఎం, ప్రవేశ ద్వారం తదితర నిర్మాణాలు, వసతులను ప్రారంభించనున్నారు. పెన్నాలోయ సమీపంలో సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు, గండికోట లోగో ఆవిష్కరించనున్నారు. వేడుకలకు వచ్చిన వారందరికీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, తెదేపా ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి భోజన సదుపాయం ఏర్పాటుచేశారని నిర్వాహకులు తెలిపారు. జిల్లాలోని ప్రజలు, పర్యాటక ప్రేమికులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా పర్యాటకశాఖాధికారి సురేష్‌కుమార్, సర్పంచి గురుఈశ్వర్ కోరారు.


ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, ఆర్డీవో శ్రీనివాస్

ప్రత్యేక బస్సు సర్వీసులు

జమ్మలమడుగులోని గండికోట ఉత్సవాలను పురస్కరించుకుని కడప ఆర్టీసీ బస్టాండు నుంచి శుక్రవారం ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ పీవో ధనలక్ష్మి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కడప నుంచి ఉదయం 9 గంటలకు, మధ్యాహ్నం 12 గంటలకు ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేశామన్నారు. తిరుగు ప్రయాణం రాత్రి 7.30 గంటలకు ఉంటుందన్నారు. జమ్మలమడుగు నుంచి గండికోటకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రతి గంటకు బస్సు సర్వీసు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

అనుకూలమైతే ఓకే... లేకుంటే వెనక్కే!

జడ్పీ ఉద్యోగుల బదిలీలపై ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లు ◆ ఉద్యోగులను చేర్చుకోని కార్యాలయాల అధికారులు

– న్యూస్‌టుడే, కడప ఏడురోడ్లు

జిల్లా పరిషత్తులో బదిలీల ప్రక్రియ అధికారికంగా ఈనెల 22న పూర్తయ్యింది. బదిలీ అయిన ఉద్యోగులు ఈనెల 23 నుంచి బదిలీ ఉత్తర్వులను తీసుకుని సంబంధిత కార్యాలయాలకు వెళుతున్నారు. తమకు అనుకూలమైన వారొస్తే అంగీకరిస్తూ, కానివారిని తిరస్కరిస్తూ ఉమ్మడి కడప జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల నుంచి తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు వస్తుండడంతో బదిలీపై వచ్చిన ఉద్యోగుల నుంచి సంబంధిత అధికారులు జాయినింగ్ ఆర్డర్లు తీసుకోవడంలేదు దీంతో జడ్పీ అధికారులను బాధిత ఉద్యోగులు సంప్రదిస్తున్నారు. దీంతో వారిని వేరే ప్రాంతానికి సర్దుబాటు చేయలేక, ప్రజాప్రతినిధులకు చెప్పుకోలేక జడ్పీ అధికారులు అయోమయంలో పడ్డారు.

◆ ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బదిలీల ప్రక్రియ చేపట్టడంతో జడ్పీ ఉద్యోగులు సంతోషించారు. దూరప్రాంతాల్లో పనిచేస్తున్నవారు దగ్గరగా రావచ్చునని ఆశతో ఎదురుచూశారు. గత నెల 17వ తేదీన బదిలీల నోటిఫికేషన్ విడుదల కాగా, అదే నెల 31వ తేదీలోగా ప్రక్రియ పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. విజయవాడలో వరదల కారణంగా ఈనెల 22వ తేదీ వరకు బదిలీ ప్రక్రియ సాగింది. ఈనెల 23 నుంచి బదిలీ అయిన ఉద్యోగులకు బదిలీ ఉత్తర్వులిస్తూ వచ్చారు. మొత్తం 15 శాఖల్లోని ఉద్యోగులను బదిలీ చేశారు. జడ్పీ పరిధిలో అయిదేళ్లు పూర్తి చేసుకున్న ఉద్యోగులు 438 మంది ఉండగా, 305 మంది బదిలీ అయ్యారు. బదిలీ ప్రాంతాలకు వెళుతున్న ఉద్యోగులను మాకు మీరు వద్దు... మాకు కావాల్సినవారే మా ప్రాంతంలో ఉండాలంటూ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల నుంచి జడ్పీ అధికారులకు తీవ్ర స్థాయిలో ఒత్తిళ్లు వస్తున్నాయి. దీంతో జడ్పీ అధికారులు ఏం చేయాలో అర్థంకాక తలలు పట్టుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం బదిలీల ప్రక్రియ పూర్తిచేసినందుకు సంతోష పడాలా... లేక ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లతో తమకు బదిలీ అయిన ప్రాంతంలో జాయినింగ్ రిపోర్టును తీసుకోనందుకు బాధపడాలో అర్థం కాని పరిస్థితి కొంతమంది ఉద్యోగులకు నెలకొంది. ఈ విషయమై జడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.


ఉద్యోగినికి బదిలీ ఉత్తర్వులు అందజేస్తున్న జడ్పీ అధికారులు

◆ జడ్పీలోని క్యూ-క్యూసీ విభాగంలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఉద్యోగినికి అయిదేళ్లు పూర్తికావడంతో బదిలీల్లో భాగంగా రాజుపాలెం మండలం ఆర్కటవేముల జడ్పీ ఉన్నత పాఠశాలకు బదిలీ చేశారు. ఈ నెల 24వ తేదీన ఆమె ఆర్కటవేముల పాఠశాలలో జాయినింగ్ ఆర్డర్‌ను ఇచ్చేందుకు వెళ్లారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాయినింగ్ ఆర్డర్‌ను తీసుకోవద్దని చెప్పారన్నారు. దీంతో ఆమె జడ్పీ అధికారులను సంప్రదించడంతో వల్లూరు మండలం గంగాయపల్లె జడ్పీ హెచ్ఎస్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. అక్కడ కూడా ప్రజాప్రతినిధుల నుంచి ఒత్తిళ్లు రావడంతో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆమె జాయినింగ్ రిపోర్టును తీసుకోలేదు. ప్రస్తుతం ఆమెకు ఎక్కడ పోస్టింగ్ ఇవ్వాలనేదానిపై జడ్పీ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

◆ జడ్పీలో టైపిస్టుగా పనిచేస్తున్న ఓ ఉద్యోగినికి అట్లూరు ఎంపీడీవో కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆమె జాయినింగ్ ఆర్డర్‌ను కార్యాలయం అధికారులు తీసుకోకపోవడంతో వెనుదిరిగారు. అట్లూరు ఎంపీడీవో కార్యాలయంలో ఓ ఉద్యోగి అయిదేళ్లుగా పనిచేస్తున్నారు. ఈయనదీ తప్పనిసరి బదిలీ అయినప్పటికీ అక్కడే ఉంచాలని ప్రజాప్రతినిధులు జడ్పీ అధికారులపై ఒత్తిడి తెచ్చారు. నిబంధనల ప్రకారం అయిదేళ్లు ఒకే ప్రాంతంలో పనిచేసినవారు తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంది. ప్రజాప్రతినిధుల ఒత్తిడితో అయిదేళ్లు పూర్తయినా సదరు ఉద్యోగి అదే కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు.

◆ రైల్వేకోడూరు ఇంజినీరింగ్ కార్యాలయంలో పనిచేస్తున్న పరిపాలనాధికారిని పెద్దముడియం బదిలీ చేశారు. ఈయన మరో 8 నెలల్లో ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈయనకు గతంలో గుండె బైపాస్ సర్జరీ జరగడంతోపాటు క్యాన్సర్ బారిన పడ్డారు. ఇటీవల ఓ ప్రమాదంలో తొడ ఎముకలు విరగడంతో శస్త్రచికిత్స సైతం జరిగింది. చిట్వేలి కార్యాలయంలో పనిచేస్తున్న పరిపాలనాధికారికి పెద్దముడియంకు బదిలీ కాగా, ప్రజాప్రతినిధుల నుంచి ఒత్తిడి రావడంతో ఈయనను ఇక్కడే ఉంచి, చిట్వేలి కార్యాలయానికి బదిలీ చేసిన పరిపాలనాధికారిని పెద్దముడియంకు బదిలీ చేశారు.


కలికిరి మండలం మొరంకిందపల్లె వద్ద చెరువుకు పడిన గండి (పాత చిత్రం)

చెరువులు ఛిద్రం!

అభివృద్ధికి గండి కొట్టిన గత వైకాపా సర్కారు
గత అయిదేళ్లుగా గండ్లూ పూడ్చలేని పరిస్థితి
ఎన్డీయే సర్కారుపైనే రైతాంగం గంపెడాశలు

– ఈనాడు, కడప

గత వైకాపా ప్రభుత్వ పాలనలో చిన్ననీటిపారుదల వ్యవస్థ ఛిద్రమైంది. జలయజ్ఞం సాగిస్తానని అప్పటి సీఎం ప్రతిజ్ఞ చేసి గట్టున పెట్టేశారు. భారీ ప్రాజెక్టుల నిర్మాణం దేవుడెరుగు...కనీసం చెరువులను సైతం పట్టించుకోలేని దుస్థితికి దిగజారారు. కేంద్రం, ప్రపంచ బ్యాంకు, జపాన్ సహా ఎన్నో సంస్థలు నిధులివ్వడానికి సిద్ధంగా ఉన్నా సద్వినియోగం చేసుకోలేని దురవస్థలో గత ఐదేళ్ల పాలన సాగింది. కనీసం చెరువులకు పడిన గండ్లను సైతం పూడ్చకుండా వదిలేసి రైతాంగానికి తీరని అన్యాయం చేసింది.

'రాజన్నకు పుత్రుడవు.. రైతన్నకు మిత్రుడవు... జగనన్నా.. జగనన్న..' అంటూ వైకాపా హోరెత్తించిన ఓ పాటలోని వ్యాఖ్యాలివి. మరి అధికారం చేపట్టాక జగనన్న ఏం చేశారు?.. అన్నదాతల నోట్లో మట్టి కొట్టే చర్యలకు తెరలేపారు. సాగుకు నీరే ఆధారం. భారీ, మధ్య తరహా ప్రాజెక్టులు నిర్మించలేక.. నిధులివ్వలేక చేతులెత్తేసిన ప్రభుత్వం కనీసం చెరువులను పట్టించుకున్న పాపాన పోలేదు.

వర్షాధార ప్రాంతాలైన అన్నమయ్య, వైఎస్ఆర్ జిల్లాల్లో చెరువులే రైతులు, ప్రజలకు జీవనాధారం. అలాంటి చెరువులు గతంలో వైకాపా నాయకగణానికి ఆర్థిక వనరులుగా, ఆస్తులుగా మారిపోయాయి. పురాతన చెరువులను పునరుద్ధరించి సాగు, తాగునీటికి యోగ్యంగా తయారు చేయాల్సిన జగన్ సర్కారు చేష్టలుడిగి చూసింది. వర్షాధార ప్రాంతాల్లో కొత్త చెరువుల అభివృద్ధి చేపట్టి ఆయకట్టు సాగులోకి తీసుకురాలేకపోయింది. గతంలో ప్రపంచ బ్యాంకు ముందుకొచ్చినా, జపాన్ ఆర్థికసాయం చేసినా, నాబార్డు నిధులిచ్చినా వైకాపా సర్కారు ఆ చేయూతను అందుకోలేకపోయింది. తన వాటా నిధుల్ని సరిగా ఇవ్వకపోవడంతో ఆర్థిక సాయం సద్వినియోగం చేసుకోలేని పరిస్థితి తలెత్తింది.

వైఎస్ఆర్‌లో ఇదీ పరిస్థితి

వైఎస్ఆర్ జిల్లాలో చెరువుల పునరుద్ధరణ, మరమ్మతులకు కృషి సంచాయి యోజన కింద 235 చెరువుల పనులు చేపట్టేందుకు 2016లో తెదేపా హయాం నుంచి ప్రయత్నాలు మొదలయ్యాయి. ఇందులో కేంద్రం 60 శాతం నిధులు ఇవ్వనుండగా, మిగిలిన నిధులు రాష్ట్రం భరించాల్సి ఉంటుంది. మొత్తం రూ.137.49 కోట్లతో అంచనాతో చేపట్టిన పనులు నత్తనడకన సాగుతూ నిలిచిపోయాయి. పథకం కింద 2023, మార్చి వరకు రూ.30 కోట్లు మాత్రమే వెచ్చించారు.

◆ ప్రపంచ బ్యాంకు రుణసాయంతో చిన్ననీటి వనరుల అభివృద్ధికి రూ.1,600 కోట్లతో పనులు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించారు. 2017-18లో ప్రారంభమైన ప్రాజెక్టు 2023-24 నాటికి పూర్తి కావాల్సి ఉండగా ఇంత వరకు పూర్తి చేయలేదు. ప్రాజెక్టు కింద వెయ్యి చెరువులను పునరుద్ధరించి 2,26,552 ఎకరాల ఆయకట్టు స్థిరీకరించాలనే ప్రయత్నానికి వైకాపా ప్రభుత్వం గండి కొట్టింది. ప్రపంచ బ్యాంకు నిధులతో పాటు రాష్ట్రం వాటాగా 30 శాతం నిధులివ్వాల్సి ఉండగా, వాటిని సమకూర్చకపోవడంతో పనులు ఆగిపోయాయి.

మంత్రి నిమ్మల దృష్టికి సమస్యలు

అన్నమయ్య జిల్లాలో గత అయిదేళ్లలో వరదలకు 106 చెరువులకు గండ్లు పడగా ఒక్కటి కూడా మరమ్మతులకు నోచుకోలేదు. ఈ విషయం ఇటీవల జిల్లాలో పర్యటించిన రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి వచ్చింది. దీనిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి వెంటనే గండ్లు పూడ్చడానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు యుద్ధప్రాతిపదికన రూ.41.32 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి మంత్రికి నివేదించారు. రానున్న రబీ సీజన్‌కు చెరువుల్లో నీటిని నిలబెట్టి రైతులకు సాగు నీరందించే దిశగా మంత్రి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.

◆ వాల్మీకిపురం మండలం బహుదా నది నుంచి తాటి చెరువుకు నీరందించే కాలువ తాటిగుంటపల్లె వద్ద కొట్టుకుపోయింది. దీని మరమ్మతులకు రూ.95 లక్షలతో ప్రతిపాదనలు తయారు చేశారు. ◆ కురబలకోటలో శీతివారిపల్లె సమీపంలో శీతి చెరువు కట్ట తెగిపోగా, దాని పునరుద్ధరణకు రూ.88 లక్షలతో చిత్తూరు ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయానికి పంపగా, ఇంతవరకు మోక్షం కలగలేదు. ◆ పీలేరులో మల్లెమ్మ చెరువు, పోతల, తలుపుల కుంట చెరువులకు మరమ్మతులు చేపట్టకపోవడంతో నీటి నిల్వకు అవకాశం లేకుండా పోయింది. ◆ ములకలచెరువు మండలం పట్నాయని చెరువు రూ.39 లక్షలు, కలికిరిలో కె.రెడ్డివారిపల్లె వద్ద దండోని ఒడ్డు చెరువు మరమ్మతులకు రూ.20 లక్షలు సైతం వెచ్చించలేకపోయింది. ఒక్క చెరువు సైతం పునరుద్ధరణకు నోచుకోకుండా వేలాది ఎకరాల ఆయకట్టు బీడుగా మారిపోయింది. కొందరు రూ.లక్షలు వెచ్చించి బోర్లు తవ్వకుని పంటలు సాగు చేయాల్సి పరిస్థితి నెలకొంది.


ఇటీవల అన్నమయ్య జిల్లా పర్యటనలో అధికారులకు సూచనలిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యం

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే : జిల్లాలోని పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తున్నట్లు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. పోలీసు అధికారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కడప ఉమేష్‌చంద్ర కల్యాణమండపంలో మూడు రోజులుగా విజయవాడలోని మణిపాల్ ఆసుపత్రి సహకారంతో పోలీసు కుటుంబాలు, మహిళా పోలీసులకు నిర్వహించిన క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... పోలీసులు తమ కుటుంబ సభ్యుల ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించామన్నారు. పోలీసులు సకాలంలో వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని వైద్యశిబిరాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మణిపాల్ ఆసుపత్రి ఎండీ సుధాకర్, వైద్యురాలు శ్రీదివ్య, రామ్‌చక్రవర్తి, ఏఆర్ ఏఎస్పీ కృష్ణారావు, ఏఎస్పీ ప్రకాష్‌బాబు, పోలీసు ఆసుపత్రి వైద్యురాలు మేరీసుజాత, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు దూలం సురేష్, ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్ పాల్గొన్నారు.


క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల పరికరాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

పలువురు ఆర్డీవోల బదిలీ

జమ్మలమడుగు, కడప సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లాలో ఆర్డీవోలను బదిలీ చేస్తూ ప్రభుత్వం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. జమ్మలమడుగు ఆర్డీవోగా ఆదిమూలం సాయిశ్రీని నియమించగా, ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాస్‌ను జీఏడీలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశించింది. పులివెందుల ఆర్డీవోగా లక్ష్మీ అన్నపూర్ణ ప్రత్యూష నియమితులు కాగా, ఇక్కడ పనిచేస్తున్న వెంకటేశ్వర్లును జీఏడీలో రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. తెలుగుగంగ ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న చంద్రమోహన్‌ను బద్వేలు ఆర్డీవోగా నియమించగా, ఇక్కడ పనిచేస్తున్న ఆర్డీవో వెంకటరమణ బదిలీ అనంతరం ఖాళీ ఏర్పడిన స్థానంలో ఇన్‌ఛార్జి ఆర్డీవోగా పనిచేస్తున్నారు. కడప ఆర్డీవోగా జాన్ పాలపర్తి, జీఎన్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న కౌసర్‌బానును రామచంద్రాపురం ఆర్డీవోగా నియమిస్తూ ఉత్తర్వులిచ్చింది.

కడప కమిషనర్‌గా మనోజ్‌రెడ్డి: కడప నగరపాలక: కడప నగర పాలకసంస్థ కమిషనర్‌గా నిమ్మనపల్లె మనోజ్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. పలమనేరు ఆర్డీవోగా పనిచేస్తున్న ఆయన్ను కడపకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.. కడప కమిషనర్‌గా ఉన్న వైట నందన్‌ను కొన్ని రోజులకిందట పురపాలకశాఖ డీడీగా బదిలీ చేశారు.



నిఘా కన్ను కునుకు!

☛ ఒంటిమిట్ట క్షేత్రంలో పనిచేయని సీసీ కెమెరాలు
☛ పోలీసుల పరిశీలనతో వెలుగులోకి వాస్తవాలు


ఒంటిమిట్ట కోదండరామాలయంలో తూర్పు గోపురం ద్వారం వద్ద మూడో నేత్రం నేలచూపులు

– న్యూస్‌టుడే, ఒంటిమిట్ట

ప్రముఖ పుణ్యక్షేత్రం ఒంటిమిట్ట బస్టాండు ప్రాంతంలో పోలీస్‌స్టేషన్ పక్కనే ఎస్‌బీఐ ఏటీఎంలోకి ఈ నెల 22న తెల్లవారుజామున ఘరానా దొంగలు చొరబడి రూ.36.19 లక్షలు దోచేశారు. ఈ నేపథ్యంలో కోదండ రామాలయం చుట్టూ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించేందుకు పోలీసులు రాగా, అవన్నీ అలంకారప్రాయంగా ఉన్నట్లు గుర్తించారు. దొంగల ఆనవాళ్లు కనిపెట్టేందుకు వచ్చిన పోలీసులకు నిరాశే ఎదురైంది.

◆ ఒంటిమిట్ట కోదండ రామాలయం ఆంధ్రుల భద్రాద్రిగా విరాజిల్లుతోంది. రాష్ట్ర అధికారిక గుర్తింపు పొందిన దివ్య క్షేత్రంగా భాసిల్లుతోంది. అయిదేళ్ల కిందట ఆలయ ముఖ, రంగ, కల్యాణ మండపాలు, ప్రాకారం గోడలు, శ్రీవారి పోటు, ప్రసాదాల పంపిణీ, తూర్పు గోపురం, భక్త సంజీవరాయస్వామి ఆలయం, మాడవీధులు, కాలిబాటలు, ఉద్యాన వనాలు, పుష్కరిణి, వాహనాల పార్కింగ్, రథమండపం, పరిపాలన, విశ్రాంతి భవనం, కడప-రేణిగుంట జాతీయ రహదారి పక్కన మొత్తం 45 చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అనంతరం వీటి పనితీరు, నిర్వహణను గాలి కొదిలేశారు. సత్రపాళెం గుట్ట పక్కన ఏర్పాటు చేసిన సీసీ కెమెరా రెండేళ్ల కిందట చోరీకి గురికాగా, ఇప్పటివరకు కొత్తది అమర్చలేదు. శ్రీవారి పోటు వద్ద రెండు సీసీ కెమెరా ఏడాది కిందట మరమ్మతులకు గురయ్యాయి. ఇప్పటివరకు 12 కెమెరాలు మాత్రమే వినియోగంలో లేవని, మరో 30 పనిచేస్తున్నాయని భద్రతా సిబ్బంది రోజువారీగా తిరుపతి విజిలెన్స్, భద్రత, పరిపాలన అధికారులకు సమాచారమిస్తూ వస్తున్నారు. ఈనెల 22న ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీ అనంతరం ఇక్కడ సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు అవాక్కయ్యారు. సీసీ కెమెరాలు పనిచేయడంలేదని గతంలో స్థానికులు జేఈవో వీరబ్రహ్మం దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే మరమ్మతులు చేయించాలని అధికారులను ఆదేశించారు. ఆ తరువాత అప్పటి వీజీవో బాలిరెడ్డి కూడా బాగు చేయిస్తామని చెప్పినా ఇంతవరకు ఆచరణకు నోచుకోలేదు.


పరిపాలన భవనం వెనుక వైపున కిందకు వేలాడుతూ...


శ్రీవారి పోటు వద్ద దెబ్బ తిందిలా...


సత్రపాళెం గుట్ట వద్ద రెండేళ్ల కిందట చోరీకి గురైన సీసీ కెమెరా

విజిలెన్స్ అధికారులకు తెలియజేశాం

ఒంటిమిట్ట రామాలయం, పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో కొన్ని పనిచేయడం లేదని మా దృష్టి వచ్చింది. మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని ఇప్పటికే విజిలెన్సు, భద్రతా అధికారులకు తెలియజేశాం. వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని లేఖ కూడా రాశాం. అన్నిచోట్ల నిఘా నేత్రాలు పనిచేసేవిధంగా చర్యలు తీసుకుంటాం.

- నటేష్‌బాబు, డిప్యూటీ ఈవో, తితిదే, ఒంటిమిట్ట

జగన్‌ను ప్రజలు తరిమికొట్టే రోజులు దగ్గరపడ్డాయి

'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, పక్కన తెదేపా నాయకులు

బి.కొత్తకోట, ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగించడం ద్వారా భక్తుల మనోభావాలను దెబ్బతీసిన మాజీ సీఎం జగన్‌తో పాటు వైకాపా నాయకులను ప్రజలు తరిమికొట్టే రోజులు దగ్గర పడ్డాయని ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్ విమర్శించారు. బి.కొత్తకోట మండలం బడికాయలపల్లెలో గురువారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో గత ఐదేళ్లలో చోటుచేసుకున్న భూదోపిడీ, అవినీతి, అక్రమాలపై పూర్తి స్థాయి విచారణ జరిపిస్తామన్నారు. తెదేపా కార్యకర్తలపై బనాయించిన అక్రమ కేసులను ఎత్తివేయడానికి ఎన్డీయే ప్రభుత్వం ఇప్పటికే కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. అంతకు ముందు బడికాయలపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ఎమ్మెల్సీ సమావేశమై విద్యాశాఖపై ప్రభుత్వం చూపుతున్న ప్రత్యేక శ్రద్ధను వివరించారు. అనంతరం సున్నా వడ్డీ కింద మంజూరైన రూ.2.80 కోట్ల రుణాలను ఎమ్మెల్సీ పంపిణీ చేశారు.

హంద్రీ-నీవా కాలువ విస్తరణ పనులు ప్రారంభం: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ప్రతి చెరువుకు హంద్రీ-నీవా జలాలు అందిస్తామని ఎమ్మెల్సీ శ్రీకాంత్, తెదేపా నేత జయచంద్రారెడ్డి అన్నారు. పెద్దతిప్ప సముద్రం మండలం దేవప్పకోట సమీపంలోని రూ.348 కోట్లతో హంద్రీ-నీవా కాలువ విస్తరణ పనులను గురువారం వారు ప్రారంభించారు. రైతుల సౌకర్యార్థం మద్దయ్యగారిపల్లి వద్ద రెండు వంతెలను నిర్మిస్తామని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో తెదేపా జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, తంబళ్లపల్లె నేత జయచంద్రారెడ్డి, రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ సభ్యురాలు పర్వీన్‌తాజ్, నాయకులు, పాల్గొన్నారు.

ఆక్రమిత భూముల స్వాధీనానికి అడుగులు!

లోకాయుక్త కోర్టు ఉత్తర్వులతో కదలిక
ఒత్తిళ్లకు తలొగ్గద్దని కలెక్టర్ ఆదేశాలు


భౌగోళిక పటాలను పరిశీలిస్తున్న ఎస్‌డీఎఫ్‌వో దివాకర్, సర్వే అధికారులు

– న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు

అటవీ ఆక్రమిత భూముల్లో అధికారులు మళ్లీ సర్వే మొదలు పెట్టడంతో ఆక్రమణదారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. కేసులు పెడితే జైలుకెళ్లాల్సి వస్తుందని, కొనుగోలుదారులకు ఎక్కడ డబ్బులు వాపసు ఇవ్వాల్సి వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. ప్రొద్దుటూరు అటవీశాఖ సబ్ డివిజనల్ పరిధిలోని రామేశ్వరం రిజర్వు ప్రాంతంలో వందల ఎకరాలు కబ్జాకు గురయ్యాయి. మొత్తం 1,044 ఎకరాల భూములున్నాయి. ఇందులో పంట పొలాలు, గృహ, వ్యాపార పరిశ్రమలాంటి నిర్మాణాలు వెలిశాయి. వీటికి నిబంధనలకు విరుద్ధంగా ఆయా ప్రభుత్వ శాఖలు విద్యుత్తు, తాగునీటి కనెక్షన్లతో పాటు ఇంటి నెంబర్లు ఇచ్చారు. సాగులో ఉన్న భూములు, ఇళ్లు, పరిశ్రమల భవనాలు కూల్చేస్తారేమోనని బెంబేలెత్తిపోతున్నారు. స్థలాలు, కట్టడాలు, పొలాలను క్రయ, విక్రయాలు జరిపి ఆక్రమణదారులు పెద్ద ఎత్తున సొమ్మును చేసుకుంటున్న పరిస్థితి ఉంది. ఈ తంతు గత 30 ఏళ్లుగా ఉన్నప్పటికీ అటవీశాఖ అధికారుల నుంచి చర్యలు శూన్యం. ఏ ఉన్నతాధికారి వచ్చినా అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు స్వాధీన చర్యలు ఆగిపోతుండడంతో ఆక్రమణదారులదే పైచేయిగా నిలిచింది.

సిద్ధంగా సర్వే నివేదిక : ఆక్రమిత అటవీ భూములను అక్టోబరు నాటికి స్వాధీనం చేసుకోవాలని లోకాయుక్త కోర్టు కలెక్టర్ శివశంకర్‌కు ఉత్తర్వులిచ్చింది. ఆ మేరకు గత నెల 23న జేసీ, డీఎఫ్‌వో, ఆర్డీవో, విద్యుత్తు శాఖ ఈఈ, ఏపీఐఐసీ జెడ్ఎం, తహసీల్దారు, పురపాలక కమిషనరు, సర్వేయర్ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో రామేశ్వరం రిజర్వు అటవీ భూమి ఎంత ఉంది? ఏపీఐఐసీకి ఇచ్చిన దెంత? వాటి హద్దులు, ఆక్రమణకు గురైందెంత? ప్రస్తుతం ఎలాంటి కట్టడాలు ఉన్నాయో? సర్వే చేసి పాత, కొత్త సర్వే నివేదికలు కలిపి ఇవ్వాలని, ఈ ప్రక్రియలో ఎలాంటి ఒత్తిళ్లకు, బెదిరింపులకు తలొగ్గొద్దని కలెక్టరు ఆదేశించారు. ఆ మేరకు ఈ నెల 18 నుంచి అధికారులు చేపట్టిన క్షేత్రస్థాయి సర్వే నివేదికలను 15 రోజుల్లో ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించినట్లు తెలుస్తోంది.


భూముల్లో పంటలు, కట్టడాలు వెలిశాయిలా...

నేతల బెదిరింపులు

కూల్చివేతలను ఆపి, ఏదైనా న్యాయం చేయాలని అనుభవదారులు, ఆక్రమణదారులు అధికార, ప్రతిపక్షం నాయకుల వద్దకు పరుగులు తీస్తున్నారు. నేతలతో ఫోన్లు చేయించి అధికారులను బెదిరిస్తున్నారు. ఏదైనా ఉంటే కలెక్టర్‌తో మాట్లాడుకోవాలని, తాము చేసే సర్వేకు ఆటంకం కల్గించొద్దని అధికారులు గట్టిగానే బదులిస్తున్నారు. దీంతో నేతలు చేసేదేమీ లేక ముందు అధికారులు ఇచ్చిన నోటీసులు తీసుకోవాలని, తర్వాత తాము అండగా ఉంటామని, మీకేమీ కాదని నాయకులు చెప్పడంతో అనుభవదారులు, ఆక్రమణదారులు వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. ఈ విషయమై ప్రొద్దుటూరు అటవీశాఖ సబ్ డివిజనల్ అధికారి ఎస్వీ.దివాకర్ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు రెండో సారి ఆయా శాఖల అధికారులతో చేపట్టిన సర్వే కొనసాగుతోందని, ఈ ప్రక్రియ ముగిసిన వెంటనే సర్వే నివేదికను అందజేసిన అనంతరం కలెక్టర్ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రకృతి రమణీయత.. చెరగని ఆత్మీయత!

● చరిత్ర పుటల్లో మన గడ్డకు ప్రత్యేక స్థానం
● నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

ఉమ్మడి కడప జిల్లాలో 21 చారిత్రక కట్టడాలున్నాయి. వీటి పర్యవేక్షణ, అభివృద్ధి భారతీయ పురాతత్త్వ శాఖ పరిధిలోకి చేర్చారు. ఒంటిమిట్ట, సిద్ధవటం, నందలూరు, రాజంపేట, జమ్మలమడుగు, వల్లూరు, చెన్నూరు, పెద్దముడియం, ఎర్రగుంట్ల మండలాల్లో పూర్వం రాజుల కాలంలో నిర్మించిన చారిత్రక కట్టడాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. రామాయణ, భారత, భాగవతం, జానపద కళారూపాలు అనితర సాధ్యంగా రూపుదిద్దుకున్నాయి. రాతి కట్టడాల లాలిత్యం రాజసం చూసిన యాత్రికులు అంతులేని ఆనందానుభూతితోపాటు తన్మయత్వం చెందుతున్నారు.

శత్రు దుర్భేద్యం.. ఘన కీర్తి సొంతం



జమ్మలమడుగు మండలంలో గండికోట శత్రు దుర్భేద్యంగా నిర్మించారు. పినాకినీ తీరంలో నిర్మించిన 40 అడుగుల ఎత్తు ప్రాకారం, 101 బురుజులతో తన రీవిని ప్రదర్శిస్తోంది. చుట్టూ అందమైన లోయలు. ఎటుచూసినా కమనీయ కట్టడాలు యాత్రికులను కట్టిపడేస్తున్నాయి. నాటి రాచరిక పాలన, రాజుల పౌరుషం, యుద్ధాలు గుర్తుకొచ్చేలా నిర్మాణాలెన్నో ఇక్కడున్నాయి. సహజమైన పెన్నా లోయ అబ్బుర పరుస్తోంది. సామంత మహారాజు కాకరాజు గండికోటను నిర్మించారని చారిత్రక శాసనాలు స్పష్టం చేస్తున్నాయి. నాడు ఇక్కడ 21 ఆలయాలను నిర్మించారు. రఘునాథ, మాధవస్వామి క్షేత్రాలు, విశాలమైన మంటపాలు, పావురాల మండపం, కారాగారం, ఎర్ర కోనేరు, జామియా మసీదు, నింగిలో మేఘాలతో దోబూచులాడే మీనార్లు, 10 మీటర్ల ఎత్తు ఉన్న ధాన్యాగారం, పెన్నానది లోయలు, ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఆయుధాగారం, ఎర్రచెరువు, ఊయల మండపం, మూడు ప్రవేశ ద్వారాలు, బయట 32, లోపల 64 గదులున్నాయి. కోటలోని శిల్పాల వన్నె నేటికీ తరగలేదు. నాటి శిల్పుల నైపుణ్యాలకు అద్దం కడుతోంది. చరిత్రాత్మక అమరగాథలకు మౌన సాక్షిగా నిలిచిన ఈ కోట మన వారసత్వ సంపదకు ప్రతీకగా నిలుస్తోంది.

ప్రాచీన జైన క్షేత్రం దానవులపాడు

జమ్మలమడుగు మండలం పినాకిని తీరంలో మహోన్నత జైనక్షేత్రంగా దానవులపాడు గుర్తింపు పొందింది. సున్నపురాతి శిల్పాలున్నాయి. జైనతీర్థంకరుని విగ్రహం, పద్మావతి, రామాలయం చూపరులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. ఎర్రగుంట్ల మండలం చిలంకూరులో విఘ్నేశ్వర, అగస్త్యేశ్వరస్వామి, పెద్దముడియం దివ్య క్షేత్రాలు, చెన్నూరు మండలం శివాల్‌పల్లి ఆలయం పురాతన కట్టడాల జాబితాలో చేరాయి.

అందాల కొండ హార్సిలీహిల్స్




ప్రకృతి అందాల కొలువు... ఆహ్లాదకరమైన వాతావరణానికి నెలవుగా ఉన్న బి.కొత్తకోట మండలంలోని హార్సిలీ హిల్స్ పర్యాటకులకు సాదర స్వాగతం పలుకుతోంది. రాష్ట్ర పర్యాటక రంగ చిత్రపటంలో ప్రత్యేక స్థానం కల్గిన ఈ విడిది కేంద్రానికి ఆంధ్రా ఊటిగా ప్రత్యేక గుర్తింపు ఉంది. వేసవి ఎండల తీవ్రత నుంచి ఉపశమనం పొందడానికి కొండపైకి వస్తున్న సందర్శకుల తాకిడి నానాటికీ పెరుగుతోంది. జిల్లాకే తలమానికంగా నిలిచిన హార్సిలీహిల్స్ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టిని కేంద్రీకరించింది.

అంతులేని జలానుభూతి


ఉమ్మడి కడప జిల్లాలో 15 చిన్న, మధ్యతరహా, పెద్ద జలాశయాలున్నాయి. వీటి నిల్వ సామర్థ్యం 82.736 టీఎంసీలు. ప్రస్తుతం 56.05 టీఎంసీల నీరుంది. గండికోట, బ్రహ్మంసాగర్, పీబీఆర్, మైలవరం, పైడిపాళెం, బుగ్గవంక, వెలిగల్లు, అన్నమయ్య, దిగువ సగిలేరు, ఎస్ఆర్-1, ఎస్ఆర్-2 జలాశయాలు పర్యాటక కేంద్రాలుగా ప్రాచుర్యం పొందాయి. ఇక్కడే కాకుండా సోమశిల వెనుక జలాల ప్రాంతంలో అంతులేని జలానుభూతి పొందొచ్చు. ఇక్కడ విదేశీ విహంగాలు సందడి చేస్తున్నాయి. శేషాచలం, పాలకొండలు, లంకమల, నల్లమల, వెలిగొండల్లో అరుదైన అటవీ సంపద ఉంది. ఎన్నో వన్యప్రాణులు, పక్షులు కనువిందు చేస్తున్నాయి. జలపాతాలు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

నవాబుల గడ్డ గుర్రంకొండ



గుర్రంకొండలోని రంగినీ మహల్

విజయనగర రాజులతో అంకురార్పణ జరిగి టిప్పుసుల్తాన్‌తో అనుబంధం పెంచుకుని బ్రిటీష్ చక్రవర్తులకు సైతం అంతుబట్టని విషయాలను తనలో దాచుకున్న చారిత్రక ప్రాంతం గుర్రంకొండ ఖిల్లా... చరిత్ర పుటల్లో తనకంటూ ప్రాధాన్యం సంతరించుకుని నేడు పర్యాటక కేంద్రంగా విలసిల్లుతోంది. నాటి వైభవానికి, మతసామరస్యానికీ ప్రతీకగా నిలుస్తోంది. కోట ఆవరణంలో ప్రత్యేక అలంకరణలతో నిర్మితమైన భవనాలు, కొండ కింది భాగంలో శ్రీవినాయక, ఆంజనేయస్వామి, కొండ పైన శ్రీలక్ష్మీనరసింహస్వామి భక్తులకు దర్శనమిస్తారు. కోట ప్రాంతంలో మతసామరస్యాన్ని మరవకుండా దర్గాలు వెలిశాయి. టిప్పు సుల్తాన్ గురువు సయ్యద్‌షా వలీ బుకారీ ఇక్కడే నివాసం ఉంటూ ఎందరికో మార్గదర్శకంగా నిలిచారు. గురువులకు నిలయం గుర్రంకొండని పిలవబడుతోంది. శక్తి సామర్థ్యాలకు నిలయంగా ఉండిన గుర్రపు శాల నిలువుటద్దంగా దర్శనమిస్తోంది. ఇలాంటి ఎన్నో చారిత్రక, పర్యాటక కేంద్రాలకు నిలయం ఈ ప్రాంతం.



- న్యూస్‌టుడే, ఒంటిమిట్ట, బి.కొత్తకోట, గుర్రంకొండ

ఆహ్లాదం... ఆధ్యాత్మికం... సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు... ఇవన్నీ ఒకే గడ్డపై కనువిందు చేస్తే విరబూసే మానసికోల్లాసం అనిర్వచనీయం. తొలకరికి పులకరించే నేలతల్లి మట్టివాసన, చూడగానే ఆకర్షించే సువిశాలమైన పచ్చిక బైళ్లు, ఉవ్వెత్తున ఎగిసిపడే ఫౌంటెన్ల సవ్వడి, నివ్వెరపోయే పర్వత ఆకృతులు, వేల సంఖ్యలో సందర్శకులు ప్రకృతి రమణీయతను ఆస్వాదిస్తుంటే ఆ అనుభూతి వర్ణనాతీతం. నిశిరాత్రిలో విరజిమ్ముతున్న వెన్నెలను మైమరింపజేసేలా ప్రకాశిస్తూ, వందల ఏళ్లుగా చరిత్ర పుటల్లో చెరగని ముద్ర వేసుకున్న కడప గడప పవిత్ర పుణ్యధామం. అంతులేని ఆధ్యాత్మిక రహస్యాలకు నిలయం. నిర్మాణ శైలి లావణ్యం... రాజసం చూడాలంటే వేయికళ్లయినా సరిపోవనే మన పూర్వీకులు మన గడ్డకు ఎనలేని కీర్తి తీసుకొచ్చారు. ఇప్పటికీ ఆ వైభవం దేదీప్యమానంగా ప్రకాశిస్తోంది. సందర్శకుల మది దోచే ఎన్నో ఆహ్లాదకరభరిత దర్శనీయ కేంద్రాలు, మరెన్నో వారసత్వ కట్టడాలకు నిలయంగా మారింది మన ఉమ్మడి కడప జిల్లా. నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా మన గడ్డకు వెళ్లొద్దాం రండి!

మధ్య కైలాసం.. పుష్పగిరి

పెన్నానది ఒడ్డున కొలువైన పుష్పగిరి క్షేత్రం మధ్య కైలాసంగా దేశంలో ప్రసిద్ధి చెందింది. కాశీ, గయ, ప్రయాగ క్షేత్రాలన్నీ ఇక్కడే ఉన్నాయని పురాణాలు చాటుతున్నాయి. ఇక్కడి చెన్న కేశవ, శివాలయాలు, త్రికోటేశ్వర, దుర్గాదేవి మందిరాలు కోమలమైన శిల్పకళా విన్యాసాలతో ఆకట్టుకుంటున్నాయి. ప్రకృతి సౌందర్యం ఒడిలో ఆధ్యాత్మిక పెన్నిధిగా భాసిల్లుతోంది. ప్రాచీన వైష్ణవ క్షేత్రంగా విరాజిల్లుతోంది.

మట్లిరాజుల వైభవ చిహ్నం సిద్దవటం



జ్యోతి క్షేత్రం శ్రీశైల దక్షిణ ద్వారంగా ఎనలేని కీర్తి పొందింది. పినాకినీ ఒడ్డున 35 ఎకరాల సమతల మైదానంలో నిర్మించిన సిద్దవటం కోటకు ఘనమైన చరిత్ర ఉంది. మట్లి రాజులు పాలనలో నిర్మితమైంది. రాతితో మలచిన తోరణాలు, నృత్య కన్యలు, కళా, సభా మంటపం, దర్గా చూడొచ్చు. ఇక్కడ 18 రాజవంశస్థులు పాలించారు. జిల్లా కేంద్రంగా 1807 నుంచి 1812 వరకు కొనసాగింది. కోట వెలుపల సిద్ధేశ్వర, రంగ నాథ ఆలయాలున్నాయి. జ్యోతి గ్రామంలో శ్రీశైలం క్షేత్రానికి అనుబంధంగా జ్యోతి ఆలయం కొలువైంది.

కోదండరాముడి దివ్యధామం ఒంటిమిట్ట



ఒంటిమిట్ట కోదండ రామాలయం మహిమాన్విత భవ్య క్షేత్రంగా విరాజిల్లుతోంది. భక్తుల కొంగుబంగారం. చోళ, విద్యానగర, మట్లి రాజుల కాలంలో ఈ దివ్యధామం అభివృద్ధి చెందింది. గర్భాలయంలో ఏకశిలపై సీతారామలక్ష్మణమూర్తులు కొలువై ఉండటంతో ఏకశిలానగరిగా ఖ్యాతి సంతరించుకుంది. మూలవరులకు జాంబవంతుడు ప్రాణప్రతిష్ఠ చేశారని పురాణగాథ. తూర్పు, దక్షిణ, ఉత్తర దిశల్లో మూడు ఎత్తయిన గోపురాలు, 32 స్తంభాలతో రంగ మండపం నిర్మాణశైలి అబ్బురపరుస్తోందని ఈ క్షేత్ర సందర్శకులు మధురానుభూతిని పంచుకుంటున్నారు. ఈ ఆలయాన్ని 2015 సెప్టెంబరు 9న తితిదేలోకి విలీనం చేశారు. భక్తులకు మౌలిక వసతులు, అభివృద్ధి పనుల కోసం రూ.65 కోట్లు వెచ్చించారు. ముఖ మండపం, అంతరాలయం, గర్భగుడిలో కడప నాపరాయి తొలగించి చలువరాయి పరిచే పనులకు శ్రీకారం చుట్టారు. విమాన గోపురం పైన కళాహీనంగా ఉన్న శిల్పాలకు పూర్వాకృతి తీసుకురావాలని ఇటీవల అనుమతిచ్చారు.

భానుడి కిరణాలు సౌమ్యనాథుడిపై...



నందలూరు సౌమ్యనాథుడు విలక్షణ దైవం. అతి పెద్ద ఆలయమిది. పెద్ద ప్రాకారం. ఈ క్షేత్రాన్ని 11వ శతాబ్దంలో చోళులు నిర్మించారు. ఎందరో చక్రవర్తులు, రాజులు పాలించారు. పురాణ, చారిత్రక యశస్సుకు సజీవ తార్కాణం. గత వైభవానికి ప్రత్యక్ష నిదర్శనంగా భాసిల్లుతోంది. అపురూప సౌందర్యమైన నిర్మాణ చతురతకు కొలువు. అద్భుత శిల్పకళా పాటవానికి నెలవు. బహుదానది ఒడ్డున కొలువైన ఈ దివ్య మందిరం ఎనలేని ఖ్యాతి పొందింది. భానుడి లేలేత కాంతి కిరణాలు ఈ స్వామిపై ప్రసరించేలా వాస్తు నిర్మాణ రీతి అత్యద్భుతం. అన్నమయ్య, క్షేత్రయ్య, కాకతీయ, చోళ, పాండ్య, విజయనగర రాజులు సౌమ్యనాథుని సేవలో తరించారు. ఒకనాడు పసిడి పళ్లెరాలతో ఈ దివ్యమూర్తి హారతులు అందుకున్నారు. ముఖ మండపం 108 స్తంభాల సమన్వితంగా నెలకొంది. మంటపంలో చెక్కిన శిల్పాలు భాగవత గాథల్ని ఆవిష్కరించారు. నందలూరుకు సమీపంలోనే బౌద్ధారామాలను సందర్శించవచ్చు.

పరశురామ క్షేత్రం.. రెండో గయ హత్యరాల

రాజంపేట మండలం బాహుదా నదీతీరంలో హత్యరాల పరశురామ క్షేత్రం రెండో గయగా ఖ్యాతి పొందింది. అద్భుత సౌందర్యాన్నంతా తనలో లీనం చేసుకున్న సుందర సరోవరం. 72 స్తంభాల బౌద్ధ కేంద్రం. గదాధర, త్రేతేశ్వర పరశు రామాలయాలు ఇక్కడ చూడదగిన ప్రాంతాలు.

జలవనరుల శాఖలో బదిలీలు

కడప గ్రామీణ, న్యూస్‌టుడే : ఎట్టికేలకు నీటిపారుదలశాఖలో బదిలీలు జరిగాయి. ఈ నెల 22కు బదిలీల గడువు ముగిసింది. అదే తేదీతో ఈ నెల 26న ఉత్తర్వులు విడుదల చేశారు. ఎస్ఈ, ఈఈ, డీఈ, ఏఈల బదిలీలకు సంబంధించిన జీవోలను ముందుగా అంతర్జాలంలో ఉంచారు. జిల్లాలో ఒకే ఎస్ఈ బదిలీ అయ్యారు. క్వాలిటీ కంట్రోలు విభాగంలో ఎస్ఈగా విధులు నిర్వహిస్తున్న శారద క్వాలిటీ కంట్రోలు ఎన్టీఆర్ టీజీపీ సీఈ పరిధి తిరుపతికి బదిలీ అయ్యారు. ఈఈలు కొందరు బదిలీ కాగా బయట జిల్లాల నుంచి ఇక్కడికి కొందరు వస్తున్నారు. టీజీపీ డివిజన్-1 శ్రీకాళహస్తిలో ఈఈగా పనిచేసే మంజుల కడప సీఈ పరిధిలోని జీఎన్ఎస్ఎస్ డివిజన్ తిరుపతికి బదిలీ అయ్యారు. మామిళ్లపల్లె సీఈ కార్యాలయంలో ఈఈగా పనిచేసే శేషుబాబును డీజీపీ డివిజన్ బద్వేలుకు బదిలీ చేశారు. పోలవరం సీఈ ధవలేశ్వరం పరిధిలో పనిచేసే శివకుమార్ రామస్వామి టీజీపీ డివిజన్-2కు బదిలీ చేశారు. ఎస్‌కేడీ జీఎన్ఎస్ఎస్ డివిజన్-2లో పనిచేసే వెంకటశివరాంప్రసాద్‌ను అన్నమయ్య జిల్లా డీడబ్ల్యుఆర్వో కార్యాలయానికి బదిలీ చేశారు. కమిషనరేట్ టెండర్ల విభాగంలో పనిచేసే మధుప్రసాద్‌రెడ్డిని కడప సీఈ ప్రాజెక్టు కార్యాలయానికి బదిలీ చేశారు. కడప మైనర్ (ఎంఐ) ఇరిగేషన్‌లో పనిచేసే బాలచంద్రారెడ్డిని కర్నూలు జిల్లా ఎస్ఈ కార్యాలయం డిప్యూటీ ఎస్ఈగా బదిలీ చేశారు.

డీఈ, ఏఈలు... నీటి పారుదలశాఖలో విధులు నిర్వహిస్తున్న పలువురు డీఈలు, ఏఈలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. జోన్-4 పరిధిలో పనిచేసేవారిని ఆయా జిల్లాలకు బదిలీ చేశారు. నీటిపారుదలశాఖ పరిధిలోని సీఈ, టీజీపీ, జీఎన్ఎస్ఎస్, కేసీ కాలువ, ఇరిగేషన్ సర్కిల్ రెగ్యులర్, మైనర్ ఇరిగేషన్, తదితర విభాగాల్లో పనిచేసే డీఈలు సుమారు 36 మంది బదిలీ అయ్యారు. ఏఈలు బదిలీ అయ్యారని అధికారులు తెలిపారు.



పిండప్రదానం చేస్తున్న మేము సైతం సేవా సంస్థ సభ్యులు

కాశీలో 879 మందికి పిండ ప్రదానం

కడప, చిన్నచౌకు, న్యూస్‌టుడే : కడపకు చెందిన మేము సైతం సేవా సంస్థ సభ్యులు గురువారం కాశీలో 879 మందికి పిండ ప్రదానం చేశారు. సంస్థ ఆధ్వర్యంలో 15 ఏళ్లుగా సుమారు 879 మంది అనాథలకు అంత్యక్రియలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో సంస్థ సభ్యులు కాశీలో వారికి పిండ ప్రదానం చేశారు. సభ్యులు అయ్యవారయ్య, రాము, రామలోకం, రాజేష్, మురళీ, సురేష్, గురవయ్య, నరసింహ, రామరాజు, శివరాం, భానుప్రకాష్, లేపాక్షి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌వీఎస్ రాష్ట్ర మహాసభల విజయవంతానికి పిలుపు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆర్‌వీఎస్ నాయకులు

కడప, చిన్నచౌకు, న్యూస్‌టుడే : ఈ నెల 29న ప్రొద్దుటూరులో నిర్వహిస్తున్న రాయలసీమ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి జగదీష్ పిలుపునిచ్చారు. కడప ప్రెస్‌క్లబ్‌లో గురువారం మహాసభలకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. రాయలసీమ వాసులు ముఖ్యమంత్రులు అయినప్పటికీ సీమ అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. ప్రొద్దుటూరులోని స్త్రీ శక్తిభవన్‌లో నిర్వహించే సభను విజయవంతం చేయాలని కోరారు. రాయలసీమ విద్యావంతుల వేదిక జిల్లా కమిటీ సభ్యులు చంద్రమౌళీశ్వరరెడ్డి, పుత్తా శివారెడ్డి, బుద్ధిస్టు కల్చర్ సొసైటీ సభ్యులు కుమారస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉద్యోగుల వాలీబాల్ పోటీలు

శ్యామలాసెంటర్, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలోని ఆర్ట్స్ కళాశాలలో జరుగుతున్న ఏపీ విద్యుత్తు శాఖ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు గురువారంతో ముగిశాయి. డాక్టర్ ఎన్‌టీటీపీఎస్ విజయవాడ విజేతగా నిలవగా విశాఖపట్నం సర్కిల్ ద్వితీయ స్థానంలో, ఆర్‌టీపీపీ కడప మూడో స్థానంలో నిలిచాయి. విజేతలకు విద్యుత్‌శాఖ ఎస్ఈ తిలక్, ఏఈ శామ్యూల్ తదితరులు జ్ఞాపికలు అందజేశారు.

ఈవీఎం గోదాంల పరిశీలన

కడప, చిన్నచౌకు, న్యూస్‌టుడే : కడప కలెక్టరేట్‌లోని ఈవీఎం గోదాంలను గురువారం కలెక్టరు లోతేటి శివశంకర్ పరిశీలించారు. గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా ఈవీఎంలను భద్రపరచిన గోదాంలను పరిశీలించినట్లు కలెక్టరు తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

తప్పును కప్పిపుచ్చుకునేందుకే వైకాపా నాయకుల నాటకాలు

ఈనాడు డిజిటల్, అమరావతి : మద్యం కుంభకోణం, హత్య కేసుల్లో నిందితులను గత వైకాపా ప్రభుత్వం తితిదే బోర్డు సభ్యులుగా చేసి తిరుమల ఆలయ ప్రతిష్ఠను దెబ్బతీసిందని, ఆ దుష్పరిణామాలనే ప్రస్తుతం చూస్తున్నామని కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి ధ్వజమెత్తారు. కమీషన్ల కక్కుర్తితో శ్రీవారి లడ్డూ ప్రసాదంలో వాడే నెయ్యిని కల్తీ చేసిన వైకాపా పెద్దలు, నిజం బయటపడటంతో కొత్త నాటకానికి తెరలేపారని దుయ్యబట్టారు. మంగళగిరిలోని తెదేపా కార్యాలయంలో గురువారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. తప్పును కప్పిపుచ్చుకోవడానికి వైకాపా నాయకులు నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారు. గతంలో జగన్ భార్య భారతికి ప్రసాదం ఇస్తే, టిష్యూ పేపరులో పెట్టి పక్కన పడేసిన తీరు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేసిందన్నారు. హిందువుల మనోభావాలను కించపరచకండని హితవు పలికారు.

మహిళా ఫుట్‌బాల్ పోటీల్లో కడప జట్టుకు మూడో స్థానం

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : విజయవాడ శివారు కానూరులోని అనుమోలు ప్రభాకర్ గార్డెన్స్ మైదానంలో మూడు రోజుల పాటు జరిగిన రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల సీనియర్ మహిళల ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో అనంతపురం జట్టు విజేతగా నిలిచింది. శ్రీ సత్యసాయి జిల్లా జట్టు రన్నరప్ ట్రోఫీని కైవసం చేసుకుంది. గురువారం తృతీయ స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో కడప జట్టు 2-0 గోల్స్ తేడాతో కర్నూలుపై గెలుపొందింది. రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం ఉపాధ్యక్షుడు ముని శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా, కె.బాలకృష్ణ గౌరవ అతిథిగా హాజరై విజేతలకు జ్ఞాపికలు అందజేశారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలు

కడప క్రీడలు, న్యూస్‌టుడే : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో గురువారం కడప నగర శివారులోని రాష్ట్ర క్రీడా పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి ఆర్చరీ ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. బాలబాలికల అండర్-14, 17 విభాగాల్లో జరిగిన పోటీలను జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి అరుణకుమారి ప్రారంభించారు. జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో రాణించి జాతీయ పోటీలకు ఎంపికవ్వాలని క్రీడాకారులకు సూచించారు. ● బాలబాలికల అండర్-14 ఇండియన్ రౌండ్ విభాగంలో సిద్ధార్థ, శశివర్ధన్, కౌషల్‌దేవరాయల్, గణేష్, కావ్యశ్రీ, మధులిక, గురుగౌతమి, కీర్తన, రికర్వ్ విభాగంలో నాగచైతన్య, శ్రీహరిచరణ్, కిరణ్, సాయిహర్ష, త్రివేణి, అరిఫా, వైష్ణవి, గీతిక కాంపౌండు విభాగంలో అభినయ్, ముస్తాఫా, హేమంత్, మహిధర్, కాత్యాయని, రీనాతేజస్విని, ప్రణీత, గోపిప్రియ ఎంపికయ్యారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు


బాలగొండ గంగాధర్‌కు పర్యాటక ఎక్స్‌లెన్స్ పురస్కారం

వైవీయూ (కడప), న్యూస్‌టుడే : కడప నగరానికి చెందిన చరిత్ర అధ్యాపకుడు బాలగొండ గంగాధర్‌కు 2024 ఏడాదికి రాష్ట్ర పర్యాటకశాఖ ఎక్స్‌లెన్స్ అవార్డు ప్రకటించింది. పర్యాటకంపై రాష్ట్ర స్థాయిలో ప్రస్తుత స్థితిగతులు, ఆర్థిక, సామాజిక ప్రభావం తదితర అంశాలపై ఆయన జాతీయ స్థాయిలో ప్రచురించిన పత్రాలు, పుస్తకాలకు ఈ బహుమతి లభించింది. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సేవలందించారు. దాదాపు అయిదేళ్ల పాటు ప్రత్యేక అనుమతులతో విద్యార్థులతో పర్యాటక విభాగాన్ని నిర్వహించారు. ఆయన స్ఫూర్తితో దాదాపు వంద మందికి పైగా యువతులు పర్యాటక రంగంపై నైపుణ్యం సాధించారు. గంగాధర్ ప్రస్తుతం వేంపల్లె డిగ్రీ కళాశాలలో విధులు నిర్వహిస్తున్నారు.

శిశువు మృతి కేసులో నిందితులకు జైలు శిక్ష

వేంపల్లె, న్యూస్‌టుడే: శిశువు మృతికి కారణమైన ఓ మహిళ, ఆమె ప్రియుడికి జైలు శిక్ష విధిస్తూ కడప మొదటి ఏడీజే కోర్టు న్యాయమూర్తి ఎల్.వెంకటేశ్వరరావు తీర్పునిచ్చారని వేంపల్లె పట్టణ సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. సీఐ కథనం మేరకు... పులివెందుల పట్టణం ముద్దనూరురోడ్డుకు చెందిన బత్తిన మల్లీశ్వరి భర్త మరణించడంతో... అదే ప్రాంతానికి చెందిన చిన్నాతో వివాహేతర సంబంధం పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో 2016 జూన్‌లో ఆమె మగశిశువుకు జన్మనిచ్చారు. ఇక్కడి పాములూరుగుట్టలో ఆమె పసిబిడ్డను వదిలేయడంతో అక్కడికక్కడే శిశువు మృతి చెందారు. 2018లో ఈ కేసు కడప మొదటి ఏడీజేకోర్టుకు బదిలీ అయ్యింది. ప్రస్తుతం పోలీసుల తరపున న్యాయస్థానంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఖదీరున్నీసా ఈ కేసుపై వాదనలు వినిపించగా.. . నేరం రుజువు కావడంతో మల్లీశ్వరికి ఒక ఏడాది జైలుశిక్ష, రూ.500 జరిమానా, చిన్నాకు మూడేళ్ల జైలుశిక్ష, రూ.1,500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారని సీఐ పేర్కొన్నారు.

రహదారి ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



మైదుకూరు, న్యూస్‌టుడే : పట్టణానికి సమీపంలోని 40వ నెంబరు జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్ జిల్లా బాన్సువాడకు చెందిన **సయ్యద్ అహ్మదుల్లా** (39) మృతి చెందారు. ద్విచక్ర వాహనంపై కడప వైపునకు వెళ్తున్న అహ్మదుల్లా ముందు వెళ్తున్న రోడ్డు రోలర్‌ను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఏఎస్ఐ శివప్రసాద్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద లభించిన పాన్‌కార్డు, ద్విచక్ర వాహనం నెంబరు ఆధారంగా బంధువుల వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

4న డిగ్రీ విద్యార్థులకు వృత్తి నైపుణ్య పరీక్ష

వైవీయూ (కడప), న్యూస్‌టుడే : యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ కోర్సుల్లో 2వ సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులకు అక్టోబరు 4న స్కిల్ కోర్సు పరీక్ష నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎన్.ఈశ్వర్‌రెడ్డి గురువారం తెలిపారు. పరీక్ష మధ్యాహ్నం 2 గంటలకు ఉంటుందన్నారు. సమాచారాన్ని కళాశాలల నోటీసు బోర్డులో ప్రదర్శించాలని కోరారు.



సీఎం చంద్రబాబునాయుడికి చెక్కు అందజేస్తున్న హరినాథ్, రాహుల్

వరద బాధితులకు విరాళం

చక్రాయపేట, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయనిధికి చక్రాయపేట మండలానికి చెందిన తెదేపా నాయకుడు సానే రాహుల్ మేనమామ అంగళ్ల శెట్టి హరినాథ్ గురువారం విజయవాడలో సీఎం చంద్రబాబునాయుడిని కలిసి రూ.మూడు లక్షల చెక్కును అందజేశారు. వరదబాధితుల సహాయం కోసం సీఎం రిలీఫ్‌ఫండ్‌కు రూ.లక్ష, అన్నక్యాంటీన్‌కు రూ.లక్ష, ఎన్టీఆర్ ట్రస్టుకు రూ.లక్ష రూపాయల చొప్పున చెక్కును అందజేసినట్లు దాత హరినాథ్ తెలిపారు.

ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ బాధ్యతల స్వీకరణ



కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే : కడప, అన్నమయ్య జిల్లాల ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్‌గా **బి.జయరాజు** గురువారం కడప ప్రకాష్‌నగర్‌లోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన విశాఖపట్నం డీసీగా పని చేస్తూ బదిలీపై కడపకు వచ్చారు. 1996లో ఎక్సైజ్‌శాఖ సీఐగా విధుల్లో చేరారు. తరువాత ఏఈఎస్‌గా, ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారిగా, తర్వాత సూపరింటెండెంట్‌గా, 2023లో డిప్యూటీ కమిషనరుగా ఉద్యోగోన్నతి పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఎక్సైజ్ నేరాల కట్టడికి తమవంతు కృషి చేస్తామన్నారు. జిల్లాలో అంతర్రాష్ట్ర మద్యం, నాటుసారా, గొలుసు దుకాణాల కట్టడికి కృషి చేస్తామన్నారు.

ప్రొద్దుటూరు
● ప్రొద్దుటూరు ● జమ్మలమడుగు ● బద్వేలు ● మైదుకూరు

మైలవరం జలాల ఉద్ధృతికి ఆర్టీపీపీ రోడ్డు ధ్వంసం


ఎర్రమట్టి రోడ్డుపై ప్రవహిస్తున్న మైలవరం జలాలు

ప్రొద్దుటూరు గ్రామీణ : మైలవరం జలాశయం నుంచి వదలిన 10,800 క్యూసెక్కుల ప్రవాహంతో రామేశ్వరం-ఆర్టీపీపీ మీదుగా ఉన్న ఎర్రమట్టి రోడ్డు దెబ్బతింది. గురువారం వాహనాల రాకపోకలు నిలిపేశారు. పెన్నాలో నీటి ఉద్ధృతితో మైలవరం జలాలు చేరుకోవడంతో ఈ సమస్యకు దారి తీసింది. ప్రస్తుతం 7,800 క్యూసెక్కుల నీటి ప్రవాహముంది. తహసీల్దారు గంగయ్య హెచ్చరిక సూచికలు ఏర్పాటుచేశారు. జనం నదీ ప్రవాహ ప్రాంతానికి వెళ్లకుండా ముళ్లకంప అడ్డుపెట్టి గ్రామ వీఆర్వో, వీఆర్వేలతో పర్యవేక్షణ చేపట్టారు.

శిథిల భవనం... భయం భయం



కొండాపురం మండలంలోని కొట్టాలపల్లె గ్రామంలోని గ్రామీణ పశువైద్యశాల భవనం పైకప్పు శిథిలావస్థకు చేరి పెచ్చులూడిపడుతోంది. దీంతో సిబ్బంది, వైద్యశాలకు వచ్చే పశుపోషకులు భయాందోళన చెందుతున్నారు. ప్రమాదం జరగకముందే ఉన్నతాధికారులు స్పందించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయమై కొండాపురం పశువైద్యాధికారి రాజశేఖర్‌రాజు మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి మరమ్మతులు చేపడతామన్నారు. **-న్యూస్‌టుడే, కొండాపురం**

దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు పట్టణం పాత మార్కెట్‌లో ఉన్న లలితాదేవి, రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో అక్టోబరు 3 నుంచి 13వ తేదీ వరకు దేవి శరన్నవ రాత్రి మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్టు కమిటీ ప్రతినిధులు తెలిపారు. గురువారం దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ ఏడాది ఆలయాన్ని భక్తుల సహకారంతో పునర్నిర్మించామన్నారు. గతం కంటే వైభవంగా ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.


ఆహ్వాన పత్రాలను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

ఉమ్మడి పోరాటంతో హక్కులకు రక్షణ

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: సంఘాలన్నీ ఒక వేదిక పైకి వచ్చి ఉమ్మడి పోరాటం చేయడం వల్లనే హక్కులను రక్షించుకోవచ్చని ఏపీ దళిత వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వంగిపురం రెడ్డెన్న పేర్కొన్నారు. గురువారం బద్వేలులోని ఎన్జీవో కార్యాలయంలో దళితుల భూ సమస్యలు- హత్యాచార నిరోధక చట్టం అమలుకు దళిత, గిరిజన సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దళితుల హక్కులను కాలరాసి నిర్వీర్యం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల రాష్ట్ర నాయకులు దుర్గాప్రసాద్, యల్లయ్య, పిచ్చయ్య, ప్రసాద్‌రావు, గురుమూర్తి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీ దళిత వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రెడ్డెన్న

యాదవులకు న్యాయం చేయాలని వినతి

చాపాడు, న్యూస్‌టుడే: చాపాడు మండలం నక్కలదిన్నెలోని సర్వే నంబరు 199-1ఏలోని 3.63 ఎకరాల గ్రామ కంఠాన్ని ఒక వర్గానికి చెందినవారే సాగు చేస్తున్నారని గ్రామానికి చెందిన కొంత మంది యాదవులు జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. 1977లో ఒక్కో కుటుంబానికి 6సెంట్లు చొప్పున 60 కుటుంబాలకు అప్పట్లో పట్టాలిచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. 1985లో అగ్ని ప్రమాదం సంభవించి సంబంధిత పట్టాలన్నీ కాలిపోయాయన్నారు. రాజకీయ పలుకుబడి ఉన్నవారికే కాకుండా యాదవులందరికీ న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు వైద్య సేవలు

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: విద్యార్థుల కోసం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం హర్షణీయమని ప్రొద్దుటూరు డిప్యూటీ డీఈవో కృష్ణప్ప అన్నారు. గురువారం మండల పరిధిలోని గూడెంచెరువు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటైన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యా బోధనకే పరిమితం కాకుండా ఇలాంటి సామాజిక కార్యక్రమాలు చేపట్టడం శుభపరిణామమన్నారు.

చికిత్స పొందుతూ అర్చకుడి మృతి

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని సుంకు వెంకటసుబ్బయ్య సత్రం ఆవరణంలోని దత్తాత్రేయస్వామి దేవాలయ గర్భగుడిలో విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఆ ఆలయ ప్రధాన అర్చకుడు వీణారామానుజాచార్యులు (60) కర్నూలులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. నైవేద్యం నిధులివ్వని కారణంగా ఈవో రామచంద్రాచార్యులు ఆలయంలో కల్యాణానికి అనుమతివ్వలేదని, ఆలయం ఎదురుగా తాను ఉన్న ఇంటికి ఈవో కొత్తగా అద్దె వసూలు చేస్తూ వేధిస్తున్నారని ఆరోపిస్తూ విషద్రావణం తీసుకున్నట్లు వీణారామానుజాచార్యులు ఈనెల 20వ తేదీన సెల్ఫీ వీడియోలో చెప్పిన విషయం తెలిసిందే. ఈమేరకు అర్చకుడి కుమారుడు దత్తసాయి రెండో ఠాణా పోలీసులకు ఈవోపై ఫిర్యాదు చేశారు. కేసు విచారణ చేస్తున్నట్లు సీఐ యుగంధర్ చెప్పారు. వీణారామానుజార్యుల పార్థివదేహాన్ని జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షుడు విజయభట్టర్, పోలీసు అధికారి ధనుంజయులు, ఒంటిమిట్ట రామాలయ అర్చకులు రాఘవాచార్యులు, శ్రావణ్, మనోజ్, గండిక్షేత్రం అర్చకులు కేసరి, సుధీర్‌శర్మ, కసాపురానికి చెందిన హరి నివాళులు అర్పించారు

రాయప్పగారిపల్లెలో చోరీలు

మైదుకూరు, న్యూస్‌టుడే : పట్టణంలోని రాయప్పగారిపల్లెలో బుధవారం అయిదుగురు దొంగలు రెండు ద్విచక్ర వాహనాల్లో చక్కర్లు కొట్టారు. గ్రామంలో పలు ఇళ్ల వద్దకు వెళ్లినట్లు నిఘా కెమెరాల్లో నిక్షిప్తమైంది. ఒక ఇంటి వద్ద ప్రహరీ దూకి తలుపు తెరిచే ప్రయత్నం చేశారు. అలికిడి రావడంతో వెనుతిరిగే ప్రయత్నంలో దొంగ ప్రహరీ దూకడంలో కిందపడ్డారు. మరో ఇంటి వద్ద ముడియం హుస్సేనమ్మ నిద్రిస్తూ ఉండగా చరవాణి చోరీ చేశారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు నిఘా కెమెరాల్లో వారి కదలికలను పరిశీలించారు.

విద్యుత్తు సామగ్రి దగ్ధం

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు పట్టణం రామేశ్వరంమోరీకి సమీపంలో మిట్టమడివీధిలో టవర్ సందులో రెండు రోజుల కిందట ఉరుములతో కురిసిన భారీ వర్షానికి 30 ఇళ్లల్లో వివిధ రకాల ఎలక్ట్రానిక్ వస్తువులు ఫ్యాన్లు, వాటర్ ఫ్రిడ్జ్‌లు, సీసీ కెమెరాలు, టీవీలు, వాషింగ్ మెషీన్లు కాలిపోయినట్లు ఆ ప్రాంత వాసులు రామ్మోహన్, రాజసింహ, ప్రసాద్, వంశీ తదితరులు తెలిపారు. రూ.3 లక్షల విలువైన ఆస్తి నష్టం వాటిల్లిందన్నారు.

ట్రాఫిక్ పద్మవ్యూహంలో పసిడిపురి!

అస్తవ్యస్తంగా వాహనాల రాకపోకలు

సమస్యల నియంత్రణకు మార్గాలేవి?

-న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు, ప్రొద్దుటూరు నేరవార్తలు

జిల్లా కేంద్రం తర్వాత అతిపెద్ద పట్టణం ప్రొద్దుటూరు. పసిడిపురిగా ప్రసిద్ధిచెందిన ఈ పట్టణం ట్రాఫిక్ చక్రంలో చిక్కుకొని కొట్టుమిట్టాడుతోంది. ఒక్క రోజుకు దాదాపు 40 వేల వాహనాలు వచ్చి పోతుంటాయని అధికారుల అంచనా. ఇక్కడి రహదారులన్నీ చాలా ఇరుకుగా ఉండడం, పలు చోట్ల నడిరోడ్డుపై ద్విచక్ర వాహనాలను నిలుపుండడంతో తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.

● ముఖ్యంగా బంగారు అంగళ్ల వీధి, లైటుపాళెం వీధి, మైదుకూరు రోడ్డు, గాంధీరోడ్డు, శివాలయం రోడ్డు, కోనేటి కాలువ వీధి, హోమస్‌పేట, టీబీ రోడ్డు, సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం పరిధిలోని దుకాణాలకు వాహనాలు నిలుపు స్థలాల్లేవు. వీటి ముందు భాగంలో సగం రోడ్డును ఆక్రమించి వాహనాలను నిలుపుతున్నారు. ఫలితంగా రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. అంతేకాదు దుకాణదారులు ప్రచార బోర్డులు రహదారిపైనే ఏర్పాటు చేస్తుండంతో సమస్య మరింత జఠిలమవుతోంది.


గాంధీరోడ్డులో పెద్ద వాహనం రావడంతో ఆగిన ద్విచక్రవాహనాలు

● ఆగిన ఆర్టీసీ బస్సుల నుంచి దిగే ప్రయాణికులను ఎక్కించుకునేందుకు ఆటోలు చుట్టుముట్టుతుండడంతో బస్సు వెళ్లే వరకు ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఇదంతా ఒక్క ఎత్తైతే చరవాణిలో మాట్లాడుతూ, ట్రిపుల్ డ్రైవింగ్ చేస్తూ అడ్డదిడ్డంగా వెళ్లడం ఎక్కువగా ఉంది. దీని కారణంగా ఉదయం, సాయంత్రం వేళల్లో నిర్ణీత సమయానికి వెళ్లలేక విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ట్రాఫిక్ నియమాలు పాటించే స్పృహ ప్రజల్లో వచ్చినప్పుడు, అధికారులు కఠినంగా అమలు పరచినప్పుడు ఈ సమస్య ఒక కొలిక్కి వస్తుందని పుర ప్రముఖులు అంటున్నారు. దీనిపై ప్రొద్దుటూరు ట్రాఫిక్ సీఐ దేవకిరణ్‌కుమార్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా తాను కడప నుంచి బదిలీపై ఇటీవలనే వచ్చానన్నారు. ట్రాఫిక్ సమస్యలున్నాయని గుర్తించామన్నారు. వీటిని అధిగమించేందుకు పూర్తి స్థాయిలో ట్రాఫిక్ నియమాలను అమలు చేస్తానన్నారు.

ప్రజాశ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

పెద్దముడియం, బి.కోడూరు, బద్వేలు గ్రామీణ, కలసపాడు, న్యూస్‌టుడే: ప్రజాశ్రేయస్సే ఎన్డీయే కూటమి ప్రభుత్వ లక్ష్యమని జమ్మలమడుగు భాజపా ఎమ్మెల్యే చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి అన్నారు. గురువారం పెద్దముడియం మండలంలోని భీమగుండం, బోడితిప్పనపాడు, మండల కేంద్రం బి.కోడూరు, బద్వేలు, కలసపాడు మండలాల్లో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు అభివృద్ధి, సంక్షేమాన్ని కాంక్షించి కూటమి ప్రభుత్వాన్ని తీసుకొచ్చారన్నారు. సర్వోన్నత నియోజకవర్గంగా జమ్మలమడుగును తీర్చిదిద్దుతానని అన్నారు. భీమగుండం ఎత్తిపోతల పథకం కింద గొట్టపు మార్గాల మరమ్మతులకు రూ.60లక్షలు మంజూరు చేశామని వీటితో సుమారుగా 4 వేల ఎకరాల ఆయకట్టు రైతులకు లబ్ధి చేకూరనుందని తెలిపారు. ఓవర్‌హెడ్ ట్యాంకు, సీసీ రహదారుల ఏర్పాటుకు భూమిపూజ చేశారు. తెదేపా నియోజకవర్గ బాధ్యుడు చదిపిరాళ్ల భూపేష్ రెడ్డి మాట్లాడారు. కూటమి నాయకులు గోవర్ధన్ రెడ్డి, ధనిరెడ్డి కొండారెడ్డి, మాధవరెడ్డి, రామసుబ్బారెడ్డి, దస్తగిరిరెడ్డి, చక్రపాణిరెడ్డి, రాధారెడ్డి, చిట్టెపు నాగిరెడ్డి, అధికారులు, ఇతరులు పాల్గొన్నారు.


భీమగుండంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి, పక్కన భూపేష్‌రెడ్డి, అధికారులు



బి.కోడూరులో మాట్లాడుతున్న తెదేపా సమన్వయకర్త రితేష్‌రెడ్డి, పక్కన భాజపా నేత బొజ్జా రోశన్న, అధికారులు, నాయకులు

రూ.2 కోట్లతో బి.కోడూరు అభివృద్ధి

బి.కోడూరు మండల అభివృద్ధికి ప్రభుత్వం రూ. 2 కోట్లు మంజూరు చేసిందని తెదేపా బద్వేలు నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌రెడ్డి తెలిపారు. మండలంలో ప్రభుత్వ భూములు అధికంగా ఉన్నాయని ఇక్కడ కర్మాగారాలు తీసుకొచ్చేందుకు ప్రభుత్వాన్ని అడుగుతామని చెప్పారు. బ్రహ్మంసాగర్ నుంచి ఆర్‌టీపీపీ, కొప్పర్తికి నీటిని తరలిస్తున్న విషయంపై ముఖ్యమంత్రి వద్ద ప్రస్తావించగా నియోజకవర్గ అభివృద్ధికి సాగు, తాగునీరు రైతులకు అందజేయడం ముఖ్యమని చెప్పారన్నారు. భాజపా నాయకుడు బొజ్జ రోశన్న మాట్లాడారు. ఈ కార్యక్రమానికి రెవెన్యూ, విద్యుత్తు, వ్యవసాయశాఖల అధికారులు హాజరుకాకపోవడంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని సమన్వయకర్త అన్నారు. సభలో ఏపీఎం సీతారామిరెడ్డిని మాట్లాడాలని కోరగా ఆయన ఏముంది చెప్పడానికని మైక్ ఇచ్చేయడంతో ఆ నాయకుడు వంద రోజులుగా ప్రభుత్వం చేస్తున్న సేవలపై రెండు మాటలు చెప్పడం చేతకాదా అని మండిపడ్డారు. ఎంపీడీవో భాస్కరరావు, కూటమి నాయకులు రామచంద్రారెడ్డి, రామసుబ్బారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, గోడి రమణారెడ్డి, శేషారెడ్డి, తిరుపతిరెడ్డి, పవన్, సర్పంచి మున్నెల్లి గుర్రయ్య, తదితరులు పాల్గొన్నారు. బద్వేలు మండలంలోని తిరువెంగళాపురం, రాజుపాళెం గ్రామాల్లో అధికారులు గోడపత్రాలను ఆవిష్కరించారు.

స్థానికుల ఫిర్యాదుతో పూడిక పనులకు మోక్షం

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు పట్టణం సూపర్‌బజారురోడ్డు ప్రధాన కూడలి వద్ద రుషి అపార్టుమెంటు నుంచి బొల్లవరం వరకు వెళ్లే ప్రధాన మురుగుకాలువ పూడిక పనులను ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి గురువారం పరిశీలించారు. రెండు రోజుల కిందట 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో మురుగుకాలువ పూడిక సమస్యపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో కాలువ పనులను చేపట్టారు. పారిశుద్ధ్య కార్మికులతో పాటు అదనంగా మరో 20 మంది ప్రైవేటు కార్మికులతో పూడిక పనులు చేస్తున్నారు. పురాతన కాలువ ఎంత వరకు ఉందో ఆ మేరకు పూడిక తొలగించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈయన వెంట పారిశుద్ధ్య అధికారి నూర్‌బాషా ఉన్నారు.


పూడిక పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి

కడప నుంచి ఎంఎస్ఎంఈని తరలించొద్దని వినతి

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: కడపలో కొప్పర్తి మేఘ ఇండస్ట్రియల్ హబ్ అనుసంధానంగా ఉన్న మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ టెక్నాలజీ టెస్టింగ్ సెంటర్‌ను (ఎంఎస్ఎంఈ) అమరావతికి తరలించొద్దని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం స్థానిక గాంధీ కూడలిలో ప్లకార్డులతో జీవో నంబరు 56 రద్దు చేయాలని కోరుతూ నిరసన తెలియజేశారు.

క్రీడల్లో సత్తా చాటిన విద్యార్థులు

బద్వేలు, కలసపాడు, న్యూస్‌టుడే: బద్వేలు బీవీఆర్ కళాశాలలో గురువారం జరిగిన క్రీడల్లో విద్యార్థులు తమ సత్తాను చాటారు. అండర్ 14 బాలికల విభాగంలో వంద మీటర్ల పరుగు పందెంలో బద్వేలు బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన జాస్మిన్ ప్రథమ, కలసపాడు కేజీబీవీకి చెందిన షహీన్ ద్వితీయ, బీవీఆర్ హైస్కూల్‌కు చెందిన మోక్షిత తృతీయస్థానంలో గెలుపొందారు. అండర్ 17 బాలుర విభాగంలో హైజంపులో బద్వేలు బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన చైతన్య ప్రథమ, వెంకటాపురం జడ్పీ హైస్కూల్‌కు చెందిన శ్యామ్ ద్వితీయ, కలసపాడు జడ్పీ హైస్కూల్‌కు చెందిన వినీత్ తృతీయ స్థానం, అండర్ 17 బాలికల లాంగ్ జంపు విభాగంలో బి.కోడూరు కేజీబీవీకి చెందిన ఎం సుజాత ప్రథమ, లావణ్య ద్వితీయ, పోరుమామిళ్ల కేజీబీవీకి శిరీష తృతీయ, అండర్ 14 విభాగంలో షాట్‌పుట్‌లో గోపవరం జడ్పీ హైస్కూల్‌కు చెందిన మహబూబ్‌బాషా ప్రథమ, గోవిందాయపల్లె హైస్కూల్‌కు చెందిన ప్రతాపరెడ్డి ద్వితీయ, కలసపాడు జడ్పీ హైస్కూల్‌కు చెందిన రాజేష్ తృతీయస్థానంలో నిలిచారు.

జిల్లా క్రీడలకు విద్యార్థుల ఎంపిక

ముద్దనూరు న్యూస్‌టుడే: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారని గురువారం బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్ మాధవరెడ్డి మాట్లాడుతూ ముద్దనూరు బాలుర ఉన్నత పాఠశాల వద్ద జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో అండర్-14 బాలుర హైజంప్ విభాగంలో ఓంతేజ మొదటి స్థానం, గోపీచంద్ మూడో స్థానం పొందారు. లాంగ్ జంప్‌లో 600 మీటర్ల విభాగంలో పునీత్ రెండో స్థానం, అండర్-17 బాలుర విభాగంలో వెంకటతేజ మొదటి స్థానంలో ఎంపికయ్యారు. వీరిని యోగ మాస్టర్ రామ్‌కుమార్, తెలుగు ఉపాధ్యాయుడు అన్వర్‌బాషా, సిబ్బంది అభినందించారు.


పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఫెన్సింగ్ జిల్లా జట్టు...

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు జార్జిక్లబ్ ఇండోర్ స్టేడియంలో గురువారం జిల్లా స్థాయి అండర్-14, 17 బాలబాలికలకు ఫెన్సింగ్ క్రీడా పోటీలు జరిగాయి. మొదట క్లబ్ కార్యదర్శి పురుషోత్తమరెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో నెగ్గిన ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నెగ్గిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేశారు.

బీసీలకు ఉన్నత స్థానం కల్పించాలి

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: మాజీ ఎమ్మెల్సీ, బీసీ నాయకుడు బచ్చల పుల్లయ్యకు ఫైనాన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ బోర్డు సభ్యుడి పదవి ఇవ్వడం తమకు అసంతృప్తిగా ఉందని జాతీయ బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటకృష్ణయ్య అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం సంఘ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీకోసం కష్టపడిన వారికి తగిన గుర్తింపునివ్వాలన్నారు. నాయకులు వడ్ల శ్రీనివాసాచార్య, మాదాసు మురళీ, సుబ్బరాజు, బాల పెద్దయ్య ఉన్నారు.

రోడ్లపై మాంసం అమ్మకాలు... కాలువల్లోకి వ్యర్థాలు

-న్యూస్‌టుడే, జమ్మలమడుగు

నియోజకవర్గ కేంద్రం జమ్మలమడుగు పట్టణంలో కాలి బాటలు మాంసం విక్రయ కేంద్రాలుగా మారాయి. విక్రయదారులు జీవాలను వధించి వాటికి సంబంధించి వ్యర్థాలను మురుగు కాలువల్లో పడేస్తున్నారు. ఆదివారాలతోపాటు పండగ రోజుల్లో మాంసం విక్రయాలు జోరుగా ఉంటాయి. వీటి వల్ల మురుగు నిలిచిపోవడంతో పాటు దుర్వాసన, దోమల వ్యాప్తి ప్రమాదకరంగా మారిందని నగర పంచాయతీ ప్రజలు ఆరోపిస్తున్నారు.

జీవాలను పరీక్షించే వైద్యులేరీ?

నగర పంచాయతీలో 52,889 మంది జనాభా ఉండగా సుమారు 14 వేల నివాసాలు ఉన్నాయి. 20 వార్డులున్న నగర పంచాయతీలో ఒక్కటి కూడా జంతువధశాల లేకపోవడంతో ఎక్కడపడితే అక్కడ జీవాలను కోసేసి విక్రయిస్తున్నారు. జీవాలను పరీక్షించే వైద్యులు లేక పోవడంతో అనారోగ్యంగా ఉన్నవాటిని వధించి విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రొద్దుటూరురోడ్డులోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ, సంజామల మోటు, ముద్దనూరురోడ్డు, పలగాడివీధి, మూడు రోడ్ల కూడలిలో జంతువులను వధిస్తుంటారు. వాటికి సంబంధించిన వ్యర్థాలన్నింటినీ నగర పంచాయతీకి సంబంధించిన కాలువల్లో పడేస్తున్నారు. అలా చేయడంతో ఆయా ప్రాంతాల్లో దుర్వాసనతోపాటు మురుగు కదలక దోమలు ప్రబలుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. పట్టణంలో శాశ్వత జంతువధశాల లేకపోవడతో మాంసం విక్రయాలన్నీ నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నాయి.

నగర పంచాయతీలోని వివరాలు

మాంసం విక్రయ దుకాణాలు : సుమారు 30
రోజుకి విక్రయిస్తున్న మాంసం: 1,800 కిలోలు
ఆదివారం రోజు : సుమారు 3,500 కిలోలు
కిలో మాంసం ధర : రూ.750.00


జమ్మలమడుగులో ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో పాదచారి మార్గంపైనే మాంసం విక్రయాలు

చర్యలు తీసుకుంటాం

చికెన్, మటన్‌షాపు దుకాణాల నుంచి వచ్చే వ్యర్థాలను డ్రైనేజీలో పడేయకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. సచివాలయం పరిధిలోని మాంసం దుకాణాలను గుర్తించి అక్కడి యజమానులను హెచ్చరించి జీవాల వ్యర్థాలను కాలువల్లో వేయకుండా అరికడతాం.

-మధుకుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, జమ్మలమడుగు నగర పంచాయతీ

జమ్మలమడుగుకు కొత్త కమిషనర్

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: జమ్మలమడుగు నగర పంచాయతీ నూతన కమిషనర్‌గా కె.వెంకటరామిరెడ్డి బాధ్యతలు చేపట్టారు. గురువారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలోని ఆయన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో పారిశుద్ధ్యం, దోమల నియంత్రణపై ప్రత్యేక చొరవ తీసుకుని ప్రజలకు ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు.


వెంకటరామిరెడ్డి

చిట్టి చేతులు... గట్టి చేతలు

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: కృష్ణ, గుంటూరు జిల్లాల వరద బాధితుల కోసం స్థానిక ఈడిగపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు రూ.16 వేలు విరాళాలు సేకరించారు. గురువారం ఆంగ్ల ఉపాధ్యాయుడు చాంద్‌బాషా హెచ్‌ఎం అనురాధకు అందజేయగా ఆమె అభినందించి ఆ నగదును సీఎం రిలీఫ్ ఫండ్‌కు పంపిస్తామన్నారు.


ఉపాధ్యాయుడితో విరాళాలు సేకరించిన విద్యార్థులు

పీఆర్ ఈఈ సేవలు మరువలేనివి

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: పంచాయతీ రాజ్ ఈఈ కర్నాటి నాగరాజు సేవలు మరువలేనివని ఆ శాఖ డీఈ సూర్యనారాయణ, డీఈఏ శ్రీధర్‌గుప్తా పేర్కొన్నారు. పంచాయతీ రాజ్ ఈఈగా పనిచేస్తూ నంద్యాల డివిజన్‌కు బదిలీ అయిన కర్నాటి నాగరాజుకు గురువారం సన్మానం నిర్వహించారు. వారు మాట్లాడుతూ బద్వేలు డివిజన్‌లో ప్రభుత్వం నిర్దేశించిన పనులు సకాలంలో పూర్తి చేయించి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిపారని చెప్పారు. అనంతరం ఈఈ నాగరాజు మాట్లాడుతూ అందరు సహకారంతోనే ఈ విజయం సాధించామన్నారు. అనంతరం ఆయన్ను పంచాయతీ రాజ్ అధికారులతో పాటు, పలువురు గుత్తేదారులు ఘనంగా సన్మానించారు. ఏఈలు, కార్యదర్శులు గుత్తేదారులు పాల్గొన్నారు.

పింఛనుదారులకు మధ్యంతర భృతిని ప్రకటించాలి


మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

చాపాడు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ పింఛనర్లకు 30శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన అన్నవరం జడ్పీ ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయులను కలిసి మాట్లాడారు. 11వ పీఆర్సీలో ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోయినట్లు చెప్పారు. 12వ పీఆర్సీని మెరుగైన ఫిట్‌మెంట్‌తో ప్రకటించాలన్నారు. ప్రాథమిక పాఠశాలల నిర్వీర్యానికి కారణమైన 117 జీవో రద్దు చేయాలన్నారు. ఆంగ్ల మాధ్యమంతోపాటు, తెలుగును సమాంతరంగా కొనసాగించాలన్నారు.

నంద్యాల సీటీవో-2గా కొండాపురం యువతి

కొండాపురం, న్యూస్‌టుడే: కొండాపురం గ్రామానికి చెందిన ఈశ్వర్‌రెడ్డి, సువర్ణ దంపతుల కుమార్తె సుజిత నంద్యాల జిల్లా సీటీవో-2 (కమర్షియల్ ట్యాక్ అధికారి)గా బాధ్యతలు స్వీకరించారు. గత ఏడాది విడుదలైన గ్రూప్-1 ఫలితాల్లో ప్రతిభ చూపి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్ అధికారిగా ఎంపికయ్యారు. విజయవాడలో శిక్షణ పూర్తి చేసుకుని సీటీవో బాధ్యతలు స్వీకరించినట్లు ఆమె గురువారం తెలిపారు. దీంతో మండల ప్రజలు, ఉపాధ్యాయులు, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.


సీటీవో సుజిత

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ




ముద్దనూరు న్యూస్‌టుడే: ముద్దనూరు ఎంపీడీవోగా **ముకుందరెడ్డి** గురువారం బాధ్యతలు స్వీకరించారు. వెంపల్లెలోని గండి వీరాంజనేయస్వామి ఆలయంలో అసిస్టెంట్ కమిషనర్‌గా ఉన్న ముకుందరెడ్డి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు.

కడప

• కడప • పులివెందుల • కమలాపురం

ఎంఎస్ఎంఈ కేంద్రాన్ని తరలించొద్దని వినతి


సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మాధవి

అరవిందనగర్, కడప న్యూస్‌టుడే : ఎంఎస్ఎంఈ టెక్నాలజీ కేంద్రాన్ని కొప్పర్తిలోనే ఉంచాలని కోరుతూ తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మాధవి సీఎం చంద్రబాబుకు వినతిప్రతం అందజేశారు. గురువారం విజయవాడలో ముఖ్యమంత్రిని కలిసి పలు అంశాలను ఆయనతో చర్చించారు. కొప్పర్తిలోనే ఎంఎస్ఎంఈ కేంద్రాన్ని ఉంచాలని ఇందుకు సంబంధించి మరిన్ని పరిశ్రమలు నెలకొల్పాలని కోరారు.

ట్రిపుల్‌ఐటీలో నియామకాలు


దీప్తికి నియామకపత్రం అందిస్తున్న డైరెక్టర్ కుమారస్వామిగుప్త

వేంపల్లె, న్యూస్‌టుడే: ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో పనిచేస్తున్న ఇరువురికి వివిధ శాఖల్లో హోదాలు కల్పించారు. ట్రిపుల్‌ఐటీ గణిత విభాగంలో మెంటారుగా పనిచేస్తున్న డా.దీప్తిని ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తగా, ఈసీఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న సుధాకర్‌రెడ్డిని ఎస్టాబ్లిష్‌మెంట్ కో-ఆర్డినేటర్‌గా నియమించారు. గురువారం వారు బాధ్యతలు స్వీకరించారు. డైరెక్టర్ కుమారస్వామిగుప్త, ఏవో రవికుమార్, మధుసూదన, శరవణ్‌కుమార్, రాఘవరెడ్డి, పవన్, అనిల్‌కుమార్‌రెడ్డి ఘనంగా సత్కరించారు.

కూలీ రేట్లు పెంచాలని డిమాండు

కడప, అరవింద్‌నగర్, న్యూస్‌టుడే : ఒప్పందం ప్రకారం హమాలీలకు కూలీ రేట్లు పెంచాలని ఏఐటీయూసీ జిల్లా ఉపప్రధాన కార్యదర్శి కేసీ బాదుల్లా డిమాండు చేశారు. కూలీ రేట్లు పెంచాలని డిమాండు చేస్తూ గురువారం కడప మార్కెట్ యార్డులో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా సివిల్ సప్లయ్స్‌లో పని చేస్తున్న హమాలీలకు కూలీరేట్లు పెంచాలని కోరారు. కొత్త రేట్లు 2024 జనవరి నుంచి అమలు చేయాలని కోరారు. హమాలీ కార్మికుల యూనియన్ నాయకులు వెంకటరమణ, ప్రతాప్, రాజశేఖర్, నాగన్న, రామ్మోహన్ పాల్గొన్నారు.

అమ్మా.. మీ కుటుంబాన్ని మరవలేను




రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబానికి చెందిన కందుల శకుంతల.. ముఖ్యమంత్రి చంద్రబాబును గురువారం సచివాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఆమె కుటుంబంతో ఉన్న అనుబంధాన్ని చంద్రబాబు గుర్తు చేసుకుంటూ... మీ కుటుంబాన్ని ఎప్పటికీ మరవలేనంటూ వ్యాఖ్యానించారు. కుటుంబ సభ్యుల గురించి ఆరా తీస్తూ క్షేమ సమాచారం తెలుసుకున్నారు.

- న్యూస్‌టుడే, కడప

గ్రామాన్ని తీసుకోండి... పునరావాసం కల్పించండి

యురేనియం ప్రభావిత ప్రాంత గ్రామస్థుల ఆవేదన


సాగుచేయకుండా వదిలేసిన పొలం

వేముల, న్యూస్‌టుడే : యురేనియం ప్రభావిత ప్రాంతాల వారి సమస్యలు తీరడం లేదు. పరిశ్రమ అధికారులు కనీస వసతులు కల్పించకపోవడంతో అవస్థలు పడుతున్నారు. యురేనియం వ్యర్థాలను కనంకిందకొట్టాల గ్రామంలోని టైలింగ్‌పాండులో నింపుతున్నారు. ఈ టైలింగ్‌పాండుతో కష్టాలు అనుభవిస్తున్నామని. తమ గ్రామాన్ని తీసుకుని పునరావాసం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు అధికారులను కోరుతున్నారు. 2016 నుంచి టైలింగ్‌పాండ్‌లోని వ్యర్థాలతో పరిసర గ్రామాల ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని ఆరోపిస్తున్నారు. అప్పట్లో సమస్య పరిష్కారం కోసం ఆందోళన బాటపట్టారు. సమస్యను పరిష్కరించాలని ప్రజలు చేపట్టిన ఆందోళనతో దిగివచ్చిన యూసీఐఎల్ అధికారులు నామమాత్రంగా సీఎండీ పర్యటించి వ్యర్థాలు కలుషితం కాలేదని తేల్చారు. టైలింగ్‌పాండ్‌లోని వ్యర్థాలు గొట్టపుబావుల్లోకి వెళ్లి నీరు కలుషితమై సాగులో ఉన్న పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోందని కొట్టాల గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

నష్టపోతున్నాం... ఆదుకోండి...

టైలింగ్‌పాండ్‌తో నష్టపోతున్నామని తమ గ్రామాన్ని తీసుకుని పునరావాసం కల్పించాలని కొట్టాల గ్రామస్థులు వేడుకుంటున్నారు. గ్రామంలో 125 ఇళ్లు ఉండగా 500కు పైగా జనాభా ఉన్నారు. 475 ఎకరాల వరకు సాగుభూమి ఉంది. ఇందులో అరటి, మిరప, టమాటా, వేరుసెనగ, పత్తి, అలసంద, పెసర, తదితర పంటలు సాగు చేసేవారు. 2016 నుంచి ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. వ్యర్థాల లీకేజీతో పంట సాగు తగ్గిపోయింది. కొంతమంది పంట సాగుచేయకుండా భూములను వదిలేశారు. వ్యర్థాలకు సంబంధించిన గొట్టాలకు తరచూ లీకేజీ ఏర్పడుతూ గ్రామస్థులను ఆందోళనకు గురి చేస్తోంది. టైలింగ్‌పాండ్ గ్రామానికి సమీపంలో ఉండడంతో బలమైన గాలులు వీచే సమయంలో దుమ్ముధూళితో కాలుష్యం వ్యాపిస్తోంది. దీంతో ఆరోగ్యం మీద తీవ్ర ప్రభావం చూపుతోందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కొందరికి కీళ్లనొప్పులు, శరీరంపై గడ్డలు, స్త్రీలు గర్భస్రావం కోల్పోవడం వంటి సమస్యలు ఎదుర్కొంటున్నామని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. సమస్య శాశ్వత పరిష్కారానికి గ్రామంతోపాటు భూములను కొనుగోలు చేసి పరిహారంతోపాటు పునరావాసం, అర్హులైనవారికి ఉద్యోగావకాశాలు కల్పించాలని గ్రామస్థులు డిమాండు చేస్తున్నారు. ఈ విషయంపై యూరేనియం పరిశ్రమ అధికారి స్పందిస్తూ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందిస్తే ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. సమస్యను పరిష్కరించే స్థాయి తమ పరిధిలో లేదని పేర్కొన్నారు.


టైలింగ్‌పాండ్‌లో యురేనియం వ్యర్థాలు

బతకడం కష్టంగా ఉంది

కలుషితనీటితో పంట దిగుబడి సరిగ్గా లేదు. దీంతో బతుకు భారమవుతోంది. గ్రామంపై కాలుష్యం తీవ్ర ప్రభావం చూపుతోంది. జీవితం దినదినగండంగా మారుతోంది. అయిదు ఎకరాల భూమి ఉన్నా కుటుంబ పోషణకు సరిపడా ఆదాయంలేదు. పిల్లల చదువు ప్రశ్నార్థకంగా మారుతోంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి. **-రామాంజనేయులు, కొట్టాల**

శాశ్వత పరిష్కారానికి చొరవచూపాలి

సమస్య శాశ్వత పరిష్కారానికి చొరవచూపాలి. తరచూ వ్యర్థాల లీకేజీతో ఇబ్బందులు పడుతున్నాం. గొట్టపుబావుల్లో సాగునీరు కలుషితం కావడంతో పంట దిగుబడి లేకుండా పోయింది. దీంతో భూములను బీడుగా వదిలేయాల్సిన దుస్థితి నెలకొంది.

- రవిశంకర్, కొట్టాల

న్యాయం అందించేందుకు కృషి

కడప న్యాయవిభాగం : ఉచిత న్యాయ సేవల కోసం 15100 నంబరును సంప్రదించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆమె మాట్లాడారు. బాధితులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఉచిత సహాయక నంబరుతో పాటు ఆన్‌లైన్‌లో కూడా అర్జీలు చేసుకోచ్చునని పేర్కొన్నారు.

సర్వజన ఆసుపత్రి పరిశీలన...

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని గురువారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ జడ్జి బాబా ఫకృద్దీన్ పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఏవైనా సమస్యలుంటే 15100 నంబరులో సంప్రదించాలని రోగులకు సూచించారు. అనంతరం ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని పరిశీలించారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే : కడప ఒకటో పట్టణ ఠాణా పరిధిలో బాలిక అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. కడప ఎర్రముక్కపల్లెలోని కందిపాలెంకు చెందిన బాలిక (16) ఈ నెల 24న తన తండ్రితో కలిసి ఎర్రముక్కపల్లెకు వచ్చారు. ఈ నేపథ్యంలో బాలిక అదృశ్యమైనట్లు ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలిక కోసం గాలిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

విద్యార్థులకు హిందీపై పట్టు అవసరం


మాట్లాడుతున్న తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమీర్‌బాబు

కడప ఏడురోడ్లు, : చిన్ననాటి నుంచే విద్యార్థులు హిందీపై పట్టు సాధించాలని తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమీర్‌బాబు సూచించారు. హిందీ వారోత్సవాల్లో భాగంగా నబీకోటలోని ఓ పాఠశాలలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయుడు మహేష్‌నాయక్‌ను సన్మానించారు.

ప్రయాణికుల అవస్థలు... పట్టని ఆర్టీసీ అధికారులు


బస్సు కోసం నీటిలో పరిగెడుతున్న మహిళ

కడప, చిన్నచౌకు, న్యూస్‌టుడే : ప్రయాణికుల నుంచి సెస్ డబ్బులు వసూలు చేస్తున్న ఆర్టీసీ అధికారులు ప్రయాణికులక కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. వర్షం కురిస్తే ఆర్టీసీ బస్టాండు ప్రాంగణం చెరువును తలపిస్తోంది. వాననీరు కనీసం అయిదారు రోజుల వరకు అలానే నిలిచి ఉంటుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గురువారం ప్రొద్దుటూరు నుంచి వచ్చిన మహిళలు బస్సు దిగేందుకు నానాఅవస్థలు పడ్డారు. ఓ ప్రయాణికురాలు చంటిబిడ్డను ఎత్తుకుని అతికష్టం మీద బస్సు దిగారు. మరో మహిళ బస్సు కోసం నీటిలో పరిగెత్తక తప్పలేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి బస్టాండు ప్రాంగణంలో నీరు నిల్వ లేకుండా చర్యలు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సుధాకర్‌రెడ్డి మృతికి ప్రముఖుల నివాళి


నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

కమలాపురం, న్యూస్‌టుడే : పట్టణంలోని రెడ్డికాలనీలో గురువారం మీగడ సుధాకర్‌రెడ్డి పెద్దకర్మకు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఈ నెల 14న సుధాకర్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. పెద్ద కర్మకు మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డితో పాటు ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి సోదరులు ఆనంద్‌భార్గవ్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, పరిశ్రమలశాఖ మాజీ సలహాదారు రాజోలి వీరారెడ్డి, ఉద్యానవన శాఖ మాజీ సలహాదారు ప్రసాద్‌రెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ సీఎస్ నారాయణరెడ్డి తదితరులు హాజరై సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జీవో 56 రద్దుకు డిమాండు

కడప, అరవింద్‌నగర్, న్యూస్‌టుడే : ఎంఎస్ఎంఈ టెక్నాలజీ కేంద్రాన్ని అమరావతికి తరలిస్తూ జారీ చేసిన జీవో నంబరు 56ను రద్దు చేయాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి డిమాండు చేశారు. ఎంఎస్ఎంఈ టెక్నాలజీ కేంద్రాన్ని తరలించడాన్ని ఖండిస్తూ గురువారం కడప కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొప్పర్తి పారిశ్రామిక కేంద్రం ఉత్తర బ్లాక్‌లో రూ.250 కోట్ల అంచనా వ్యయంతో 19.5 ఎకరాల విస్తీర్ణంలో ఎంఎస్ఎంఈ టెక్నాలజీ కేంద్రాన్ని తరలించడం సరికాదన్నారు. నాయకులు మగ్బుల్‌బాషా, లక్ష్మీదేవి, బాలచెన్నయ్య, సుబ్బరాయుడు, ఓబులేసు పాల్గొన్నారు.

ఎన్డీయే ప్రభుత్వంతోనే ప్రజాసంక్షేమం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి తెలిపారు. మండలంలోని కొలుములపల్లె పంచాయతీలో గురువారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు అమలు చేస్తున్నారన్నారు. అనంతరం స్వచ్ఛతాహీ సేవలో భాగంగా మొక్కలు నాటి నీరు పోశారు. గుర్రంగుంపులోని చెరువులకు నీరందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరెడ్డి, నాయకులు ఆయనకు వినతిపత్రం అందజేశారు. తహసీల్దారు నాగేశ్వరావు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో శ్రీధర్, గ్రామీణ సీఐ శంకర్‌నాయక్, తెదేపా మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, మాజీ కన్వీనర్ గంధం మోహన్‌బాబు, నాయకులు పాల్గొన్నారు.

తెదేపా నాయకుడి మృతికి సంతాపం : చింతకొమ్మదిన్నె: మండలంలోని బుగ్గలపల్లెకు చెందిన తెదేపా నాయకుడు రాఘవరెడ్డి(78) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఆయన మృతదేహానికి కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి నివాళులర్పించారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

వేంపల్లె, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు వేంపల్లె స్వామి వివేకానంద ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్ 14 బాలికల విభాగంలో పాఠశాలకు చెందిన విద్యార్థినులు హాసిని, ప్రమీల, బాలుర విభాగంలో రేవంత్‌కుమార్‌రెడ్డి, మహమ్మద్ షాహల్, అండర్ 17 బాలికల విభాగంలో సాహిత్య భాను ఎంపికయ్యారు. వీరు త్వరలో గుంటూరు, తెనాలి, తూర్పుగోదావరి జిల్లాల్లో పాల్గొంటారని పాఠశాల కరస్పాండెంట్ సీఎస్ రామాంజనేయరెడ్డి తెలిపారు.


ఎంపికైన విద్యార్థులతో కరస్పాండెంట్ సీఎస్ రామాంజనేయ రెడ్డి

ఉద్యోగులపై చర్యలకు డీఎంఈ ఆదేశం

సర్వజన ఆసుపత్రి, న్యూస్‌టుడే : రిమ్స్‌లో ట్యూటరుగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన డాక్టర్ రామచంద్రయ్యకు సౌలభ్యాలకు సంబంధించిన ప్రపోజల్స్‌ను ప్రభుత్వానికి పంపించకపోవడంతో రిమ్స్‌లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు కార్యాలయ సూపరింటెండెంట్లపై, ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌ను నుంచి ఆదేశాలు జారీ అయినట్లు డాక్టర్ రామచంద్రయ్య తెలిపారు. ఈ విషయంపై ఆర్డీ డాక్టర్ శ్రీనివాసులను వివరణ కోరగా.. ఇద్దరు కార్యాలయ సూపరింటెండెంట్లపై, ఇద్దరు కార్యాలయ సీనియర్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకోవాలని డీఎంఈ నుంచి ఆదేశాలు జారీ అయినట్లు వెల్లడించారు.

భార్యాభర్తలపై కేసు నమోదు

కడప, నేరవార్తలు : భార్యాభర్తలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కడప నబీకోటకు చెందిన లక్ష్మీదేవి, శ్రీనివాసులు చిట్టీలు నిర్వహించేవారు. కొంతకాలంగా చిట్టీలు కట్టినవారికి డబ్బులు ఇవ్వడం లేదు. సుబ్రమణ్యం అనే వ్యక్తికి రూ.5 లక్షలు ఇవ్వకపోవడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు భార్యాభర్తలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అక్రమార్కులపై చర్యలకు డిమాండు

మారుతీనగర్, న్యూస్‌టుడే : జిల్లాలో భూమాఫియా అక్రమాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయిందని, అధికారులు చర్యలు తీసుకుని అర్హులైన పేదలకు భూములు పంపిణీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర పేర్కొన్నారు. అక్టోబర్ 1న బద్వేల్‌లో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

విద్యార్థులు క్రమశిక్షణ పెంపొందించుకోవాలి

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి క్రమశిక్షణ పెంపొందించుకోవాలని ప్రముఖ రచయిత, నిర్మాత, వ్యక్తిత్వ వికాస నిపుణుడు ప్రదీప్ తెలిపారు. మండల పరిధిలోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో పెంపొందించుకున్న జ్ఞానం భవిష్యత్తుకు దోహదపడుతుందన్నారు. ప్రిన్సిపల్ సుధాకర్‌రెడ్డి, ఏవో రామసుబ్బారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధురాలికి గాయాలు

చెన్నూరు : మండల పరిధి బుడ్డాయపల్లె సమీపంలోని జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కేవోఆర్ కాలనీకి చెందిన లక్షుమ్మ గాయపడ్డారు. ఖాజీపేట మండలానికి చెందిన ఓ వ్యక్తి ద్విచక్రవాహనంపై వేగంగా వచ్చి లక్షుమ్మను ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అభివృద్ధే కూటమి సర్కారు లక్ష్యం


బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న బీటెక్ రవి

చక్రాయపేట, న్యూస్‌టుడే : సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెదేపా పులివెందుల నియోజకవర్గ బాధ్యుడు బీటెక్ రవి పేర్కొన్నారు. మండలంలోని మారళ్లమడక సచివాలయంలో గురువారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడిన వందరోజుల్లోనే ప్రజల మన్ననలు పొందామన్నారు. తెదేపా మండల బాధ్యుడు మహేశ్వర్‌రెడ్డి, ఎంపీడీవో సోమశేఖర్, తహసీల్దారు విజయకుమారి, భాజపా రాష్ట్ర కార్యవర్గసభ్యులు కె.రామచంద్రారెడ్డి, నాయకులు చంద్ర, అశోక్‌కుమార్, రామాంజులరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థికసాయం అందజేత: ఇటీవల గువ్వలచెరువు ఘాట్‌రోడ్డు వద్ద ప్రమాదంలో మృతి చెందిన చక్రాయపేట మండలం వడ్డెపల్లెకు చెందిన ముగ్గురు, చక్రాయపేటకు చెందిన డ్రైవరు కుటుంబాలకు బీటెక్ రవి రూ.50 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. ఒకరికి ఉద్యోగం, మిగిలిన పిల్లలకు విద్యావసతులు కల్పిస్తామని భరోసా ఇచ్చారు.

విద్యార్థులపై తల్లిదండ్రులు దృష్టి సారించాలి

పెండ్లిమర్రి, న్యూస్‌టుడే: విద్యార్థులపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని, అప్పుడే మెరుగైన ఫలితాలు వస్తాయని స్థానిక జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఇందిర తెలిపారు. కళాశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులతో అధ్యాపకులు ఆత్మీయ సమావేశం గురువారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు వారి పిల్లలు కళాశాలకు వెళ్తున్నారా లేదా అనేది గమనించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల ప్రగతిని అధ్యాపకులు వివరించారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

లింగాల, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం బండ్లపల్లె చిత్రావతి నది నుంచి అక్రమంగా ఇసుక తీసుకొచ్చి పులివెందులలో విక్రయానికి తరలిస్తుండగా అంబకపల్లె వద్ద గురువారం అదుపులోకి తీసుకొని రెండు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్సై మధుసూదనరావు తెలిపారు.

చోరీల నివారణకు ప్రత్యేక నిఘా

వేంపల్లె, న్యూస్‌టుడే: పులివెందుల పట్టణంలో జరుగుతున్న చోరీలను అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కర్నూలురేంజి డీఐజీ కోయప్రవీణ్ ఇటీవల పులివెందులకొచ్చి ఇక్కడ సాగుతున్న చోరీలపై డీఎస్పీ మురళీనాయక్, సీఐ గంగనాథ్‌బాబుతో చర్చించారు. ఈ నేపథ్యంలో డ్రోన్ కెమెరాల ద్వారా గురువారం నిఘాను ప్రయోగాత్మకంగా చేపట్టామని సీఐ వివరించారు.

భాజపాలో కష్టపడిన వారందరికీ గుర్తింపు

వేంపల్లె, న్యూస్‌టుడే: భాజపాలో కష్టపడిన వారందరికీ తగిన గుర్తింపు ఉంటుందని ఆ పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు రామచంద్రారెడ్డి గాలిహరిప్రసాద్ పేర్కొన్నారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా నియమితులైన శశిభూషణ్‌రెడ్డిని గురువారం సత్కరించారు. వాణిజ్యవిభాగం జిల్లా అధ్యక్షుడు దొంతుసుమన్, పార్టీనేతలు వినోద్‌కుమార్‌రెడ్డి, సోము, దశరథ, తదితరులు పాల్గొన్నారు.

దీపాలు వెలగక... అవస్థలు తప్పక


పెండ్లిమర్రిలోని బస్టాప్ వద్ద వెలగని దీపం

వెల్లటూరు(పెండ్లిమర్రి), న్యూస్‌టుడే : కడప-పులివెందుల ప్రధాన రహదారి వెంబడి ఏర్పాటు చేసిన విద్యుత్తు దీపాలు కొన్ని రోజులుగా వెలగడం లేదు. దీంతో రహదారి పక్కనున్న గ్రామాల ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళల్లో బస్టాప్‌ల వద్ద వేచి ఉండే ప్రయాణికులు చీకటి కారణంగా అవస్థలు పడుతున్నారు. దీపాలు వెలగకపోవడంతో ప్రయాణికులు ప్రమాదాల బారినపడుతున్నారు. పెండ్లిమర్రిలో రహదారికి ఇరువైపుల గతంలో ఏర్పాటు చేసిన వీధి దీపాలు వెలగడం లేదు. ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, పోలీసుస్టేషన్, ప్రభుత్వ కార్యాలయాలు అన్నీ రహదారి వెంబడి ఉన్నాయి. రాత్రి వేళల్లో ఈ ప్రాంతంలో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు పలుమార్లు అధికారులు, నాయకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. తుమ్మలూరు, మాచనూరు, నాగాయపల్లె గ్రామాలకు వెళ్లేందుకు రాత్రి వేళలో బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు, ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు చీకట్లో ఇబ్బందులు పడుతున్నారు. వెల్లటూరులో రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన 20 వీధి దీపాలు మరమ్మతులకు గురయ్యాయి. వెల్లటూరు మెయిన్, రాజీవ్ నగర్ బస్టాప్‌ల వద్ద, పొలతలకు వెళ్లే వారు, తిరిగి వచ్చే భక్తులు ఇక్కడ బస్సుల కోసం వేచి ఉంటారు. ఇక్కడ దీపాలు వెలగక చీకట్లో రోడ్డు దాటే సమయంలో పలుమార్లు ప్రమాదాల బారినపడిన సంఘటలున్నాయి. నందిమండలంలో రోడ్డుకు ఇరువైపులా వేసిన 10 దీపాలు వెలగడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి ప్రధాన రహదారి వెంబడి గ్రామాల వద్ద వీధి దీపాలకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై ఈవోపీఆర్డీ శివరామిరెడ్డిని న్యూస్‌టుడే వివరణ కోరగా.. పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులతో చర్చించి దీపాలకు మరమ్మతులు చేయిస్తామన్నారు.